RNI Reg-No. APTEL/2002/07373

Postal Registration No.VJ/215/2025-27

# నేటి మనదేశమ్

NETIMANADESAM TELUGU DAILY

తెలుగు దినపత్రిక

Simultaneously published from Vijayawada, Visakhapatnam, Tirupati & Hyderabad

సంపుటి :24 Vol. No.24 సంచిక : 94 Issue No. 94 విజయవాడ Vijayawada సంపాదకులు: కె.ఎస్.రంగశాయి: శుక్రవారం 03-04-2026 Friday, April 03 2026 పేజీలు : 8 Pages: 8 వెల: రూ.1-00 Price Rs.1-00

## పోలవరం ప్రాజెక్టు కొత్త డయాఫ్రం వాల్ నిర్మాణం పూర్తి



అమరావతి, ఏప్రిల్ 2 (నేటి మనదేశమ్ ప్రతినిధి): పోలవరం ప్రాజెక్టు నిర్మాణంలో అత్యంత కీలకమైన మిగతా 2లో..




# అమరావతికి ఆమోద ముద్ర

- రాజ్యసభలోనూ ఏకగ్రీవం
- బిల్లును రాష్ట్రపతికి పంపనున్న కేంద్రం
- రాష్ట్రపతి సంతకంతో గెజిట్ విడుదల

**న్యూఢిల్లీ, ఏప్రిల్ 2 (ఆర్ఎన్ఎ):** ఆంధ్రప్రదేశ్ రాజధానిగా అమరావతి చట్టబద్ధత బిల్లుకు పార్లమెంట్ ఆమోదం తెలిపింది. ఈ అమరావతి బిల్లుకు ఉభయ సభలు ఏకగ్రీవ ఆమోదం తెలిపాయి. అనంతరం ఈ బిల్లును కేంద్రం.. రాష్ట్రపతికి పంపనుంది. ఈ బిల్లుపై రాష్ట్రపతి ద్రౌపది ముర్ము సంతకం చేసిన తర్వాత గెజిట్ నోటిఫికేషన్ విడుదలకానుంది. దీంతో ఏపీ ఏకైక రాజధానిగా అమరావతి అమల్లోకి రానుంది. ఈ బిల్లు రాజ్యసభలో గురువారం ఆమోదం పొందడంతో.. ఆంధ్రప్రదేశ్ ప్రజలకు రాజ్యసభ చైర్మన్ సి.పి.రాధాకృష్ణన్ మిగతా 2లో..

## అమరావతికి చట్టబద్ధతకు థాంక్స్

ప్రధాని మోడీని కలిసి లోకేశ్ కృతజ్ఞతలు



**న్యూఢిల్లీ, ఏప్రిల్ 2 (ఆర్ఎన్ఎ):** అమరావతికి చట్టబద్ధత బిల్లుకు బుధవారం లోక్‌సభ ఆమోదం తెలిపిన సంగతి తెలిసిందే. ఈ బిల్లుకు లోక్‌సభలో ఏకగ్రీవ ఆమోదం లభించింది. వైసీపీ మినహా మిగిలిన పార్టీలు బిల్లుకు మద్దతు తెలిపాయి. గురువారం బిల్లును రాజ్యసభలో ప్రవేశ పెట్టారు. హోంశాఖ సహాయమంత్రి నిత్యానందరాయ్ బిల్లును రాజ్యసభలో ప్రవేశపెట్టారు. ఈ క్రమంలో అమరావతికి చట్టబద్ధత బిల్లును లోక్‌సభ ఆమోదించిన నేపథ్యంలో మంత్రి నారా లోకేశ్ భారత ప్రధాని నరేంద్ర మోదీని కలిశారు. ఐదుకోట్ల మంది ప్రజల ఆకాంక్ష అయిన అమరావతికి చట్టబద్ధత కల్పించే బిల్లుకు పూర్తి మెజార్టీతో లోక్‌సభలో ఆమోదం లభించడానికి కృషి చేసిన ప్రధాని మోదీకి లోకేశ్ కృతజ్ఞతలు తెలియజేశారు. గురువారం ఉదయం పార్లమెంట్ హాలులో మంత్రి లోకేశ్ ప్రధాని నరేంద్ర మోదీని కలిశారు. దేశంలో ఉన్న అన్ని పార్టీలను ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం వైపు నిలిపి అమరావతికి చట్టబద్ధత కల్పించిన ప్రధాని మోదీకి ఆంధప్రదేశ్ ప్రజల తరఫున ధన్యవాదాలు తెలిపారు. లోక్‌సభలో బిల్లు ఆమోదం పొందిన వెంటనే మంత్రి నారా లోకేశ్ మిగతా 2లో..

## వాడపల్లిలో వైభవంగా వేంకటేశ్వర స్వామివారి కళ్యాణోత్సవాలు ఉత్సవాలు

భారీగా హాజరైన భక్తులు



**కోనసీమ, ఏప్రిల్ 2 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** కోనసీమ తిరుమలగా ఖ్యాతిగాంచిన వాడపల్లి వేంకటేశ్వర స్వామివారి కళ్యాణోత్సవాలు అంగరంగ వైభవంగా సాగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా తెప్పోత్సవం నిర్వహించారు. భక్తి, శ్రద్ధల సమ్మేళనంగా తెప్పోత్సవం కొనసాగింది. విశేష పూజలతో పాటు, కన్నుల పండుగగా జరిగింది. వేకువజామున ఆలయ అర్చకుల మేల్కొలుపుతో ప్రారంభమైన ఈ మహోత్సవంలో గౌతమి గోదావరి పవిత్ర జలాలను తెచ్చి స్వామివారికి సమర్పించడం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. అనంతరం నిత్యార్చన, నిత్య హోమాలు, బలిహరణ, నీరాజనం, మంత్రపుష్పం వంటి వైదిక కార్యక్రమాలు ఘనంగా నిర్వహించారు. స్వామి వారు అమ్మవార్లకు విశేష పూజారి కార్యక్రమాలతో ఆలయ ప్రాంగణం ఆధ్యాత్మిక కాంతులతో మిగతా 2లో..

## అమరావతికి చట్టబద్ధత దక్కడం అభినందనీయం

ఈ విజయం రాజధాని రైతులదే అన్న చంద్రబాబు... ఎక్స్ వేదికగా స్పందించిన సిఎం

**అమరావతి, ఏప్రిల్ 2 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** పార్లమెంట్ ఉభయ సభల్లో రాజధాని అమరావతి చట్టబద్ధత బిల్లు ఆమోదం పొందడం పట్ల ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు హర్షం వ్యక్తం చేశారు. ఈ బిల్లు ఆమోదం పొందడంపై తన ఎక్స్ ఖాతా వేదికగా గురువారం సీఎం చంద్రబాబు స్పందించారు. ఈ విజయం అమరావతి రైతులకు అంకితం ఇస్తున్నట్లు టీడీపీ జాతీయ అధ్యక్షుడు ప్రకటించారు. రాజధాని కోసం వారు చేసిన త్యాగం, చూపిన పట్టుదల మరువలేనివి అంటూ రైతులపై సీఎం చంద్రబాబు ప్రశంసలు కురిపించారు. అమరావతి ఇక ఆంధ్రులకు ఏకైక ప్రజా రాజధాని అని స్పష్టం చేశారు. రాజధానిపై ఇక ఎలాంటి అనుమానాలకు, చర్చలకు తావు లేదన్నారు. పార్లమెంట్‌లో ఏపీ పునర్వ్యవస్థీకరణ (సవరణ) బిల్లు-2026 ఏకగ్రీవంగా ఆమోదం పొందడం చారిత్రాత్మకం అని ఆయన అభివర్ణించారు. ఈ బిల్లు ద్వారా ఆంధ్రుల ఆకాంక్ష నెరవేరిందని.. అమరావతికి లభించిన ఈ గౌరవం ప్రతీ ఆంధ్రుడికి గర్వకారణమని ఏపీ సీఎం పేర్కొన్నారు. ఈ సందర్భంగా ప్రధాని



నరేంద్ర మోదీకి హృదయ పూర్వక కృతజ్ఞతలు తెలియజేశారు. అమరావతి ప్రస్థానంలో ప్రతీ అడుగులో ప్రధాని మోదీ అండగా నిలిచారన్నారు. 2015లో రాజధానికి శంకుస్థాపన.. 2025లో పునర్నిర్మాణం... ప్రధాని మోదీ చేతుల మీదుగానే జరిగిందని ఈ సందర్భంగా ఏపీ సీఎం గుర్తు చేసుకున్నారు. అందుకు కేంద్ర ప్రభుత్వంతోపాటు హోంశాఖ మంత్రి అమిత్ షా పూర్తిగా సహకరించారని వివరించారు. పార్లమెంటులో ఈ బిల్లు ఆమోదానికి సహకరించిన అన్ని రాజకీయ పార్టీలకు ఈ సందర్భంగా ఆయన ధన్యవాదాలు తెలియజేశారు.

రాష్ట్ర విభజన తర్వాత ఎదుర్కొన్న చీకటి రోజులకు ఇది ముగింపు అని సీఎం చంద్రబాబు వివరించారు. పీ ప్రగతికి ఈ నిర్ణయం కొత్త నాంది అని సీఎం చంద్రబాబు పేర్కొన్నారు. ఏపీకి గుండె, ఆత్మ అయిన అమరావతి ఇక అన్‌స్టాపబుల్ అని ఆయన చమత్కరించారు. దేశానికే అద్వితీయమైన భవిష్యత్ నగరంగా అమరావతి నిలుస్తుందని విశ్వాసం వ్యక్తం చేశారు.

## అమరావతి విజయం రైతులదే


- అధికారంలోకి రాగానే నాలుక మడతేసిన జగన్
- మూడు రాజధానులంటూ రైతులకు హింసలు
- మీడియా సమావేశంలో మంత్రి లోకేశ్



**న్యూఢిల్లీ, ఏప్రిల్ 2 (ఆర్ఎన్ఎ):** ఎన్నికలకు ముందు ఏకైక రాజధాని అమరావతి అని చెప్పిన జగన్.. గెలిచిన ఆర్నెళ్లలో మూడు రాజధానుల పేరిట డ్రామా చేశారని మంత్రి నారా లోకేశ్ విమర్శించారు. ప్రపంచంలో మూడు రాజధానుల విధానం ఎక్కడా విజయవంతం కాలేదని చెప్పారు. దిల్లీలో ఆయన మీడియాతో మాట్లాడుతూ.. తెలుగు ప్రజలంతా కలిసి హైదరాబాద్‌ను నిర్మించుకున్నారని, అయితే, రాజధాని లేకుండా ఏపీని విభజించారని అన్నారు. రాష్ట్రానికి మధ్యలో రాజధాని ఉండాలని అమరావతిని ఎంపిక చేశామని, 2014లో వైకాపా సహా అన్ని పార్టీలు దీనికి అంగీకరించాయన్నారు. రాజధాని కోసం 58 రోజుల్లో 35 వేల ఎకరాల భూమిని రైతులు ఇచ్చారు. వైకాపా అధికారంలోకి వచ్చిన తర్వాత రాజధానిగా అమరావతిని మిగతా 2లో..

## దుస్సాహసానికి పాల్పడితే ప్రతిస్పందన తీవ్రం

పాకిస్థాన్‌కు భారత రక్షణ మంత్రి రాజ్‌నాథ్ హెచ్చరిక



**తిరువనంతపురం, ఏప్రిల్ 2 (ఆర్ఎన్ఎ):** ఇరాన్ యుద్ధం నేపథ్యంలో పాకిస్థాన్‌ను భారత రక్షణ మంత్రి రాజ్‌నాథ్ పరోక్షంగా హెచ్చరించారు. ప్రస్తుత పరిస్థితులను ఆసరాగా చేసుకొని పొరుగుదేశం ఏదైనా దుస్సాహసానికి పాల్పడితే ప్రతిస్పందన తీవ్రంగా ఉంటుందన్నారు. కేరళలోని తిరువనంతపురంలో ఏర్పాటు చేసిన ఓ కార్యక్రమంలో మాట్లాడిన ఆయన.. ఉగ్ర చర్యలపై మిగతా 2లో..

## జగన్ వ్యాఖ్యలపై జనం నవ్వుకుంటున్నారు

రాష్ట్రాలకు రాజధాని ఉండదనడం మూర్ఖత్వమే: రాజ్యసభలో జగన్ వ్యాఖ్యలపై మండిపడ్డ లక్ష్మణ్

**న్యూఢిల్లీ, ఏప్రిల్ 2 (ఆర్ఎన్ఎ):** రాజధాని అమరావతి విషయంలో వైసీపీ తీరును ముఖ్యంగా జగన్ వ్యాఖ్యలు చూసి ప్రజలు నవ్వుకుంటున్నారని బీజేపీ ఎంపీ కె.లక్ష్మణ్ ఎద్దేవా చేశారు. రాష్ట్రాలకు రాజధాని గురించి చట్టంలో ఉందా? అని ఆ పార్టీ అధినేత జగన్ ప్రశ్నిస్తున్నారని పేర్కొన్నారు. తాజాగా 'మావిగన్' అనే పేరు తీసుకొచ్చారని ఆయన వ్యంగ్యంగా అన్నారు. దాంతో పిల్ల కాంగ్రెస్ పిల్ల చేష్టలకు ప్రపంచం నివ్వెర పోయిందని ఎద్దేవా చేశారు. పిల్ల చేష్టలతో రాజధాని అంశంలో వైసీపీ మూడుముక్కలాట ఆడిందని మండిపడ్డారు. ఎన్నికల్లో పిల్ల కాంగ్రెస్, తల్లి కాంగ్రెస్‌ను ప్రజలు మట్టి కరిపించారని గుర్తు చేశారు. రాజధాని అమరావతికి చట్టబద్ధత బిల్లు ఆమోదంపై గురువారం రాజ్యసభలో చర్చ జరిగింది. ఈ సందర్భంగా ఎంపీ కె.లక్ష్మణ్ మాట్లాడారు. దేశ భాషలందు తెలుగులెస్స అంటూ ఆయన తన ప్రసంగాన్ని ప్రారంభించారు. అమరావతి కోసం సుదీర్ఘ పోరాటం చేసిన రైతులకు నమస్కారాలు తెలిపారు. తెలుగు జాతి చరిత్ర అందరూ తెలుసుకోవాల్సిన అవసరం ఉందన్నారు.



ప్రత్యేక రాష్ట్రం కోసం పొట్టి శ్రీరాములు నిరాహార దీక్ష చేసి.. ప్రాణత్యాగం చేశారని గుర్తు చేశారు. రాజధాని కోసం 29 వేల మందికిపైగా రైతులు తమ భూములు ఇచ్చారని పేర్కొన్నారు. ఏపీ, తెలంగాణను గతంలో కొంతమంది ప్రముఖులు విలీనం చేశారని ఎంపీ కె.లక్ష్మణ్ గుర్తు చేశారు. తెలంగాణకు ఇచ్చిన హామీలను గత ప్రభుత్వాలు నెరవేర్చలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆ క్రమంలో ప్రభుత్వాన్ని నిలదీసినందుకు ప్రజలను కాల్చి చంపిన చరిత్ర కాంగ్రెస్ పార్టీది అని అన్నారు. చొక్కాలు మార్చినట్లుగా సీఎంలను కాంగ్రెస్ పార్టీ మార్చిందని మిగతా 2లో..

## నా చేతుల్లో ఏం లేదు

అధికారులను నిర్బంధించడంపై సీఎం మమతా



**కలకత్తా, ఏప్రిల్ 2 (ఆర్ఎన్ఎ):** పశ్చిమబెంగాల్ లో 'సర్' విధుల్లో ఉన్న జ్యుడీషియల్ అధికారులను నిర్బంధించడంపై తీవ్ర దుమారం రేగుతోంది. దీనిపై పశ్చిమబెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ స్పందిస్తూ.. అధికారుల నిర్బంధం విషయం తనకు తెలియదన్నారు. ప్రస్తుతం పరిపాలన తన చేతుల్లో లేదని వ్యాఖ్యానించారు. సాగర్‌దిఘిలో జరిగిన బహిరంగ సభలో మమత మాట్లాడుతూ.. 'దీనికి బాధ్యులు ఎవరో నాకు తెలియదు. దీని గురించి నాకు ఎవరూ సమాచారం ఇవ్వలేదు. పరిపాలన నా చేతుల్లో మిగతా 2లో..

మొదటి పేజీ తరువాయిలు

## పోలవరం ప్రాజెక్టు కొత్త డయాఫ్రం వాల్ నిర్మాణం పూర్తి

డయాఫ్రం వాల్ నిర్మాణం పూర్తయింది. గత ప్రభుత్వం నిర్వాకంతో డయాఫ్రం వాల్ దెబ్బతిని, రూ.440 కోట్ల మేర ప్రజాధనం వృథా అయ్యింది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత.. నిపుణుల సూచనలతో రూ.900 కోట్లతో మరో డయాఫ్రం వాల్ నిర్మించింది. గతేడాది జనవరి 18న పనులు ప్రారంభించి.. రికార్డు స్థాయిలో 440 రోజుల్లో 1,372 మీటర్ల పొడవైన కొత్త డయాఫ్రం వాల్ నిర్మించింది. ఈ పనులు పూర్తికావడంతో మంత్రి నిమ్మల రామానాయుడు ఇంజినీర్లను సన్మానించారు. పోలవరం ప్రాజెక్టు వద్ద స్వీట్లు పంచారు.

## అమరావతికి చట్టబద్ధతకు థాంక్స్

ఆగమేఘాలపై ఢిల్లీ వెళ్లారు. కూటమి పార్టీ ఎంపీలను అభినందించారు. ఉదయం ప్రధానమంత్రి మోదీని కలిసి కృతజ్ఞతలు తెలిపారు. కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన మాటకు కట్టుబడి చూపిన నిబద్ధతను మంత్రి లోకేశ్ ప్రశంసించారు.

## అమరావతి విజయం రైతులదే

కొనసాగించాలంటూ శాంతియుతంగా నిరసన చేస్తున్న రైతులను, మహిళలను దారుణంగా హింసించారు. రైతులు 1,600 రోజులకుపైగా పోరాడారు. ఏకైక రాజధానిగా అమరావతి ఉంటుందని గత ఎన్నికల్లో మళ్లీ చెప్పాం. 94 శాతం స్ట్రైక్‌రేట్‌తో ప్రజలు విజయం కట్టబెట్టారు. రాష్ట్రంలోనే అత్యధిక మెజార్టీతో విశాఖ ఎంపీ గెలిచారు. జగన్ చెప్పిన ఎగ్జిక్యూటివ్ క్యాపిటల్‌లోనే మా ఎంపీ గెలిచారు. ప్రజలంతా అమరావతే ఏకైక రాజధాని అని మద్దతు పలికారు. అమరావతి చట్టబద్ధత బిల్లు ఆమోదం పొందేందుకు సహకరించిన అందరికీ ధన్యవాదాలు. బిల్లుకు ఒక్క పార్టీ మినహా అన్ని పార్టీలు మద్దతు తెలిపాయి. ఈ విజయం అమరావతి రైతులదే అని లోకేశ్ అన్నారు.

## వాడపల్లిలో వైభవంగా వేంకటేశ్వర స్వామివారి కళ్యాణోత్సవాలు ఉత్సవాలు

నిండిపోయింది. సాంస్కృతిక కార్యక్రమాలు అందర్నీ ఎంతగానో అలరించాయి. విశేష సంఖ్యలో హాజరైన భక్తులు స్వామివారిని దర్శించుకున్న అనంతరం తీర్థప్రసాదాలు స్వీకరించారు. ప్రధాన హోమం అనంతరం స్వామివారిని సన్నాయి మేళాల నడుమ రాత్రి గౌతమి గోదావరి తీరం వైపు తీసుకెళ్లి, అంగరంగ వైభవంగా తెప్పోత్సవాన్ని నిర్వహించారు. నది మధ్యలో సాగిన ఈ తెపోత్సవం భక్తులకు కనుల విందుగా మారి, హృదయాలను భక్తి పరవశంలో ముంచెత్తింది. స్వామివారి కోసం ప్రత్యేకంగా విద్యుత్ పూల అలంకరణలతో రూపొందించిన తెప్ప అందరినీ విశేషంగా ఆకట్టుకుంది. గోదారమ్మ ఒడిలో నిర్వహించిన ఈ ఆధ్యాత్మిక కార్యక్రమం అందరిని మంత్రముగ్ధులను చేసింది. ఈ పవిత్ర వేడుకల్లో ఆలయ డిప్యూటీ కమిషనర్ నల్లం సూర్య చక్రధరరావు, ధర్మకర్తల మండలి సభ్యులు పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులకు ఎటువంటి అసౌకర్యాలు కలవకుండా విశేషమైన ఏర్పాట్లు నిర్వహించారు. ఈ వేడుకల్లో భాగంగా ఆలయ ప్రాంగణంలో విశేష ఆధ్యాత్మిక కార్యక్రమాలతో పాటు నృత్య ప్రదర్శనలు, కళా ప్రదర్శనలు, కోలాటాలు నిర్వహించారు. సమీప ప్రాంతాలు నుంచే కాకుండా సుధీర ప్రాంతాల నుండి వచ్చిన భక్తులకు ఈ కార్యక్రమాలు ఆనందాన్ని, ఉల్లాసాన్ని నింపడంతో పాటు భక్తిని కూడా పెంపొందించాయి. భక్తుల గోవింద నామస్మరణల మధ్య సాగిన ఈ మహోత్సవం కోనసీమ ఆధ్యాత్మిక వైభవాన్ని మరింత ప్రతిష్ఠాత్మకంగా నిలిపింది.

## దుస్సాహసానికి పాల్పడితే ప్రతిస్పందన తీవ్రం

గతంలో దీటుగా బదులిచ్చిన విషయాన్ని గుర్తుచేశారు. గత ఏడాది ఏప్రిల్‌లో పహల్గాం ఉగ్రదాడి జరిగింది. ఈ దాడి జరిగి ఏడాది పూర్తవుతున్న వేళ రాజ్‌నాథ్ ఈ వ్యాఖ్యలు చేయడం గమనార్హం. "ప్రస్తుత పరిస్థితుల్లో మన పొరుగు దేశం ఏవైనా కవ్వింపు చర్యలకు పాల్పడవచ్చు. ఒకవేళ అదే జరిగితే.. భారత ప్రతిస్పందన ఊహించని రీతిలో, నిర్ణయాత్మకంగా ఉంటుంది. ఉరి సెక్టార్ దాడి తర్వాత జరిపిన సర్జికల్ స్ట్రైక్స్, పుల్వామా తర్వాత వైమానిక దాడులు, పహల్గాం దాడుల అనంతరం ఆపరేషన్ సిందూర్.. ఇలా ఉగ్రవాద చర్యలపై భారత్ తీవ్రంగా స్పందించింది" అని రాజ్‌నాథ్ పేర్కొన్నారు.

## జగన్ వ్యాఖ్యలపై జనం నవ్వుకుంటున్నారు

చెప్పారు. తెలుగు ప్రజల కోసం ఎన్టీఆర్ పార్టీ స్థాపించారన్నారు. కాంగ్రెస్ విధానాలపై ఎన్టీఆర్ పోరాటం చేశారని గుర్తు చేశారు. అన్ని వర్గాల అభివృద్ధి కోసం ఎన్టీఆర్ కృషి చేశారని ఎంపీ కె.లక్ష్మణ్ తెలిపారు. బీసీలు, అట్టడుగు వర్గాలకు అవకాశాలు కల్పించిన వ్యక్తి ఎన్టీఆర్ అని కొనియాడారు. హైదరాబాద్‌ను ఐటీ హబ్‌గా మార్చడంలో చంద్రబాబు పాత్ర మరువలేనిదన్నారు. విభజన తర్వాత అమరావతి కోసం చంద్రబాబు సంకల్పం తీసుకున్నారని ఆయన పేర్కొన్నారు. రాజధాని ఏర్పాటు సందర్భంగా పార్లమెంట్ నుంచి మట్టి, పవిత్ర జలాలను అమరావతికి ప్రధాని మోదీ తెచ్చారన్నారు. ఏపీకి అండగా ఉంటామని భరోసా ఇస్తూ అమరావతికి ప్రధాని మోదీ శంకుస్థాపన చేశారని తెలిపారు. అమరావతికి చట్టబద్ధత బిల్లు కోసం ప్రజలు ఎదురుచూస్తున్నారని అన్నారు. రాజధానిని ఎవరూ మార్చకుండా పార్లమెంట్‌లో చట్టం తెస్తున్నారని బీజేపీ ఎంపీ లక్ష్మణ్ వివరించారు.

## నా చేతుల్లో ఏం లేదు

లేదు. రాష్ట్రంలో శాంతి భద్రతలను ఎన్నికల సంఘం నియంత్రిస్తుంది. వారు కేంద్ర హోంమంత్రి అమిత్ షా మాట వింటున్నారు. అధికారులందరినీ మార్చేశారు' అని అన్నారు. ఈ సందర్భంగా ఓటర్ల జాబితా సమగ్ర సర్వేపై ప్రజలు కోపంగా ఉన్నారని మమతా వ్యాఖ్యానించారు. మాల్దాలో జరిగిన ఘటన భాజపా కుట్రలో భాగమని ఆరోపించారు. వారిని ఓటమి భయం వెంటాడుతుందన్నారు. అందుకే.. అసెంబ్లీ ఎన్నికలను రద్దు చేయించి, రాష్ట్రంలో రాష్ట్రపతి పాలన విధించాలని కాషాయ పార్టీ భావిస్తుందన్నారు. ఈ సందర్భంగా ఎన్నికల సంఘంపైనా ఆమె విరుచుకుపడ్డారు. న్యాయాధికారులకు రక్షణ కల్పించడంలో వారు విఫలమయ్యారన్నారు. కాగా.. ఈ విషయంపై స్పందించిన అత్యున్నత న్యాయస్థానం రాష్ట్ర ప్రభుత్వంపై తీవ్ర ఆగ్రహం వ్యక్తంచేసింది.

# అమరావతికి ఆమోదముద్ర

(మొదటి పేజీ తరువాయి)

శుభాకాంక్షలు తెలియజేశారు. మొత్తంగా ఏపి రాజధాని అమరావతికి చట్టబద్ధత కల్పించే దిశగా కీలక పరిణామం చోటుచేసుకుంది. 'ఏపీ పునర్వ్యవస్థీకరణ చట్ట సవరణ బిల్లు'కు రాజ్యసభ ఆమోదం తెలిపింది. మూజువాణి ఓటుతో ఈ బిల్లు ఆమోదం పొందగా, ఇప్పటికే లోక్‌సభలోనూ ఈ బిల్లుకు ఆమోదం లభించిన విషయం తెలిసిందే. దీంతో పార్లమెంట్ ఉభయసభల ఆమోదం పొందిన ఈ బిల్లు రాష్ట్రపతి ఆమోదానికి పంపబడనుంది. రాష్ట్రపతి సంతకం అనంతరం అమరావతి ఆంధ్రప్రదేశ్ రాజధానిగా అధికారికంగా చట్టబద్ధత పొందనుంది. ఈ పరిణామం రాష్ట్ర రాజకీయాల్లో కీలక మలుపుగా భావిస్తున్నారు. ముఖ్యంగా రాజధాని విషయంలో ఉన్న అనిశ్చితి తొలగిపోవడం పట్ల ప్రజల్లో ఆనందం వ్యక్తమవుతోంది. రాజ్యసభలో ఈ బిల్లుపై జరిగిన చర్చ అనంతరం కేంద్ర హోమ్ శాఖ సహాయ మంత్రి నిత్యానంద రాయ్ సమాధానం ఇచ్చారు. ఏపీ రాజధాని అంశంపై ఉన్న అస్పష్టత పూర్తిగా తొలగిపోయిందని తెలిపారు. ఈ సందర్భంగా ఆంధ్రప్రదేశ్ ప్రజలకు శుభాభినందనలు తెలిపారు. ఇక, రాజ్యసభ విజిటర్స్ గ్యాలరీలో ఈ చర్చను వీక్షించిన ఏపీ మంత్రి నారా లోకేష్, ఇతర ఎంపీలు బిల్లు ఆమోదం పొందిన వెంటనే ఆనందాన్ని పంచుకున్నారు. 'జై అమరావతి' నినాదాలతో ఉత్సాహాన్ని వ్యక్తం చేశారు. కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడిని కౌగిలించుకుని, బిల్లు పై ఆయన చక్కగా మాట్లాడారని అభినందించారు. మొత్తంగా, అమరావతి చట్టబద్ధత బిల్లును లోక్‌సభ, రాజ్యసభలు ఏకగ్రీవంగా ఆమోదించడం రాష్ట్ర అభివృద్ధికి కొత్త దిశను



చూపనుంది. రాజ్యసభలో అమరావతి చట్టబద్ధత బిల్లుకు కాంగ్రెస్, బీజేపీ, టీడీపీ, టీఎంసీ, ఆప్, బీజేడీ, ఆర్జేడీ, బీఆర్ఎస్, జేడీ(యూ), శివసేన మద్దతు ఇచ్చాయి. రాజ్యసభలో అమరావతి చట్టబద్ధతపై జరిగిన చర్చలో 11 పార్టీలు పాల్గొన్నాయి. 17 మంది సభ్యులు చర్చలో పాల్గొన్నారు. అయితే రాజ్యసభలో సైతం ఈ బిల్లును వైసీపీ వ్యతిరేకించింది. రాజ్యసభలో అమరావతి చట్టబద్ధత బిల్లుపై చర్చలో 11 పార్టీలు పాల్గొన్నాయి. అలాగే బుధవారం లోక్‌సభలో ఈ బిల్లుపై చర్చ జరిగింది. ఈ చర్చలో 11 పార్టీలు పాల్గొన్నాయి. ఇక ఇటీవల ఏపీ అసెంబ్లీలో 11 గంటల 11 నిమిషాలకు ఈ బిల్లును ప్రభుత్వం పెట్టిన సంగతి తెలిసిందే. అమరావతికి చట్టబద్ధత కల్పిస్తూ రాజ్యసభలో ప్రవేశపెట్టిన బిల్లు ఆమోదం పొందడంతో కూటమిలోని పార్టీల ఎంపీలకు మంత్రి నారా లోకేశ్ అభినందనలు తెలిపారు. ఈ బిల్లుకు మద్దతు తెలిపిన పలు పార్టీల నాయకులకు లోకేశ్ కృతజ్ఞతలు తెలియజేశారు. అలాగే లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లాను స్వయంగా కలిసి మంత్రి నారా లోకేశ్‌తోపాటు కూటమి ఎంపీలు ధన్యవాదాలు తెలిపారు. రాజధాని అమరావతి బిల్లు ఉభయసభల్లో ఆమోదం పొందడంతో రాజధాని రైతులు హర్షం వ్యక్తం చేశారు. పార్లమెంట్ ఉభయ సభల్లో ఈ బిల్లు పాస్ కావడంతో రాజధాని అమరావతిలో సంబరాలు మిన్నంటాయి. మోకాళ్ళపై నిలబడి పార్లమెంటులో ఈ బిల్లుకు మద్దతిచ్చిన పార్టీలకు వారు ధన్యవాదాలు తెలిపారు. ప్రధాని మోదీ, సీఎం చంద్రబాబు నాయుడు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ చిత్రపటాలకు రాజధాని ప్రాంత రైతులు పాలాభిషేకం చేశారు. దాంతో ఆ ప్రాంతంలోని ప్రజల్లో ఆనందం వెల్లివిరిసింది. ఆంధ్రప్రదేశ్ అసెంబ్లీలో తీర్మానం చేసిన రాజధాని అమరావతి బిల్లును ఇటీవల కేంద్రానికి పంపారు. ఈ బిల్లు బుధవారం లోక్‌సభలో ఆమోదం పొందడంతో.. రాజ్యసభకు పంపారు. ఈ బిల్లుపై గురువారం రాజ్యసభలో చర్చ జరిగింది. అనంతరం ఈ బిల్లు ఆమోదం పొందింది. ఉభయ సభలు ఆమోదం పొందడంతో.. ఈ బిల్లును రాష్ట్రపతి ద్రౌపది ముర్ము సంతకం కోసం రాష్ట్రపతి భవన్‌కు పంపనున్నారు.

## లైబ్రరీ సైన్స్ కోర్సు నందు శిక్షణ పొందుటకు అర్హులైన అభ్యర్థుల నుండి దరఖాస్తులు

**విజయవాడ, ఏప్రిల్ 2 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** 5 నెలల కాల వ్యవధి గల సర్టిఫికెట్ లైబ్రరీ సైన్స్ కోర్సు నందు శిక్షణ పొందుటకు అర్హులైన అభ్యర్థుల నుండి దరఖాస్తులు కోరుతున్నట్లు పౌర గ్రంధాలయ శాఖ సంచాలకులు శ్రీ ఏ. కృష్ణ మోహన్ ఒక ప్రకటనలో తెలిపారు. శిక్షణా కాలం ది. 01-06-2026 నుండి ది. 31-10-2026 వరకూ ఉంటుందన్నారు. ఆంగ్ల మాధ్యమంలో 120 ఖాళీలు తెలుగు మాధ్యమంలో 120 ఖాళీలు ఉన్నాయన్నారు. శిక్షణ విజయవాడకు చెందిన పిఎన్ స్కూల్ అఫ్ లైబ్రరీ సైన్స్, కడపకు చెందిన రాయలసీమ ఇనిస్టిట్యూట్ అఫ్ లైబ్రరీ అండ్ ఇన్ఫర్మేషన్ సైన్స్ మరియు గుంటూరు కు చెందిన వావిలాల సమత లైబ్రరీ సైన్స్ విద్యా కేంద్రాలలో అందించడం జరుగుతుందన్నారు. ఒక్కొక్క విద్యా కేంద్రంలో తెలుగు మాధ్యమం 40, ఆంగ్ల మాధ్యమం 40 చొప్పున మొత్తం మూడు కేంద్రాలలో 240 ఖాళీలలో విద్యార్థులు శిక్షణ పొందవచ్చన్నారు. శిక్షణ కోరు అభ్యర్థులు ఇంటర్ మరియు తత్సమాన కోర్సులలో యుజిసి గుర్తింపు పొందిన విశ్వవిద్యాలయం నందు ఉత్తీర్ణులు అవ్వాలన్నారు. అభ్యర్థుల ఎంపిక అర్హత పరీక్షల్లో పొందిన మార్కుల యోగ్యత ఆధారంగా జరుగుతుందన్నారు. ఒకేషనల్ కోర్సు ద్వారా ఇంటర్ పాస్ అయిన వారు ప్రవేశమునకు అర్హులు కారని చెప్పారు. అర్హత పరీక్షలలో పొందిన మార్కులకు అదనంగా డిగ్రీ అభ్యర్థులకు 5 మార్కులు, పీజీ అభ్యర్థులకు 10 మార్కులు కలుస్తాయని చెప్పారు. ప్రభుత్వ నిబంధనల ఆధారంగా సీట్ల కేటాయింపు జరుగుతుందని చెప్పారు. మహిళా అభ్యర్థులకు రిజర్వేషన్ ఉంటుందని చెప్పారు. గ్రంధాలయ సంస్థలలో పనిచేయు అభ్యర్థులకు ప్రతీ మాధ్యమంలో 10 సీట్లు కేటాయించడం జరుగుతుందని చెప్పారు. అభ్యర్థులు తాము శిక్షణ పొందగోరే కేంద్రం యొక్క శిక్షణా సంస్థల ప్రిన్సిపల్ వారి పేరుమీద రెండు రూపాయల పోస్టల్ ఆర్డర్ సమర్పించి శిక్షణ పొందుటకు నిర్ణీత దరఖాస్తు ఫారం పొందాలన్నారు. పోస్టల్ ద్వారా దరఖాస్తు పొందుటకు ఐదు రూపాయల పోస్టల్ స్టాంప్, తమ స్వంత చిరునామా గల ఎన్విలోప్ జతచేయాలన్నారు. ఈరోజు మొదలుకుని దరఖాస్తుల విక్రయం జరుగుతుందన్నారు. దరఖాస్తులు పొందుటకు ఆఖరు తేదీ 21-04-2026 గాను పూర్తి చేసిన దరఖాస్తులు సమర్పించుటకు ఆఖరు తేదీ ది. 29-04-2026 గా నిర్దేశించామన్నారు. కావున సర్టిఫికెట్ లైబ్రరీ సైన్స్ కోర్సు నందు శిక్షణ పొందే సదవకాశాన్ని వినియోగించుకోగోరే అర్హత గల అభ్యర్థులు శిక్షణ పొందుటకు పై సమాచారం ఆధారంగా దరఖాస్తు చేసుకోవలెనని పౌర గ్రంధాలయ శాఖ సంచాలకులు కృష్ణ మోహన్ ఆ ప్రకటనలో తెలిపారు.

## జగన్‌కు గౌరవం ఉంటే క్షమాపణలు చెప్పేవారు

### మావిగన్ పేరుతో మళ్లీ రాజకీయ డ్రామాలు.... మండిపడ్డ మాజీమంత్రి కన్నా లక్ష్మీనారాయణ

**గుంటూరు, ఏప్రిల్ 2 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** జగన్.. ప్రజాభిప్రాయానికి గౌరవం ఇచ్చే రాజకీయ నాయకుడైతే అమరావతి ప్రజలకు, రాష్ట్ర ప్రజలకు క్షమాపణ చెప్పేవారని ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ అన్నారు. ఇష్టం వచ్చినట్లు వ్యంగ్యంగా మావిగన్ అంటున్నారని విమర్శించారు. మూడురాజధానిఉలు పోయి, ఇప్పుడు మావిగన్ పట్టుకున్నారని ఎద్దేవా చేశారు. ఈ మేరకు మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డిపై ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించారు. అమరావతి రాజధానిగా అన్ని పార్టీలు ఒప్పుకున్నాయని.. గతంలో జగన్ కూడా అసెంబ్లీలో ఒప్పుకున్నారని తెలిపారు. 2019 ఎన్నికల ప్రచారంలో అమరావతే రాజధాని జగన్ చెప్పిన విషయాన్ని ఈ సందర్భంగా గుర్తుచేశారు. అధికారంలోకి వచ్చిన వెంటనే మూడు రాజధానుల పేరుతో జగన్ మూడు ముక్కలాటాడి రాజధాని లేకుండా చేశారని విమర్శించారు. వైజాగ్‌ను జగన్ సర్వనాశనం చేశారని.. ఉత్తరాంధ్ర ప్రజలు బెంబేలెత్తిపోయా రన్నారు. 2024లో ఎన్డీయే కూటమికి అత్యధిక మెజార్టీ ఇచ్చారని ఎమ్మెల్యే తెలిపారు. కర్నూలులో హైకోర్ట్ ఏర్పాటుకు గత ప్రభుత్వ పాలనలో తీర్మానం చేశారా అని ప్రశ్నించారు. పార్లమెంట్‌లో చట్టం చేసిన తర్వాత గెజిట్ నోటిఫికేషన్ ఇస్తారని తెలిపారు. అమరావతి నుంచి పూచిక పుల్ల కూడా కదిలించలేరని ఆనాడే చెప్పానని తెలిపారు. పరిజ్ఞానం లేకుండా ప్లాన్ బి అంటూ మాట్లాడే మాటలకు సమాధానం చెప్పాల్సిన అవసరం లేదని ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ పేర్కొన్నారు.

## ప్రైవేటీకరణ కుట్రల నుంచి బటయపడని స్టీల్ ప్లాంట్

### నగరంలో సిఐటియు ఆధ్వర్యంలో కార్మిక సంఘాల నిరసన




**విశాఖపట్టణం, ఏప్రిల్ 2 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** ప్రభుత్వ రంగంలోని, విశాఖపట్నం స్టీల్ ప్లాంట్ పట్ల కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు కపట ప్రేమ చూపిస్తున్నాయని, ప్రైవేట్ రంగం పట్ల ప్రేమ చూపిస్తూ, ద్వంద్వ వైఖరి అవలంబిస్తున్నాయని విశాఖ ఉక్కు పరిరక్షణ కార్మిక,ప్రజా సంఘాల జెఎసి చైర్మన్ ఎం.జగ్గునాయుడు, ఎఐటియుసి జాతీయ ఉపాధ్యక్షులు డి. ఆదినారాయణ, ఐఎన్‌టియుసి రాష్ట్ర అధ్యక్షులు మంత్రి రాజశేఖర్ ఆరోపించారు. విశాఖ స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణ నిలుపుదల చేయాలంటూ, జివిఎంసి గాంధీ విగ్రహం వద్ద దీక్ష శిబిరం ఏర్పాటు చేసి 5 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా జెసి ఆధ్వర్యంలో విశాఖ నగరంలో కార్మిక ప్రజా సంఘాలు వందలాది మందితో ర్యాలీ నిర్వహించారు. డిఆర్ఎం కార్యాలయం నుండి జివిఎంసి గాంధీ విగ్రహం వరకు ర్యాలీ నిర్వహించి అక్కడ ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ ప్రభుత్వ రంగంలోని విశాఖ స్టీల్ ప్లాంట్ కు సొంత గనులు లేవన్నారు.

జి ఎస్ టి రాయితీలు లేవన్నారు. వాటర్ రాయితీ లేదన్నారు. స్టీల్ ప్లాంట్ లో తొమ్మిది వేల మంది ఉద్యోగులు పనిచేస్తుండగా, స్టీల్ ప్లాంట్ పై సుమారు రెండు లక్షల మంది ఆధారపడి జీవిస్తున్నారని చెప్పారు. అనేక దశాబ్దాల పాటు లాభాలలో నడిచిన స్టీల్‌ను ప్రైవేటీకరణ చేసేందుకు కేంద్రంలోని మోడీ ప్రభుత్వం ఐదేళ్ల క్రితం నిర్ణయించిందన్నారు. కేంద్ర నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ, విశాఖ నగరంలోనూ, రాష్ట్రంలోనూ, కార్మికులు ప్రజలు నిరసన కార్యక్రమాలు నిర్వహిస్తూనే ఉన్నారని చెప్పారు. ఇదే సందర్భంలో అనకాపల్లి జిల్లాలో కొత్తగా ఏర్పాటు చేస్తున్న ఆర్ సి ఎల్ మెటల్ స్టీల్ ప్లాంట్ కు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రా మెటీరియల్ గ్యారెంటీ ఇచ్చాయన్నారు. ల్యాండ్ రిజిస్ట్రేషన్, స్టాంప్ డ్యూటీ చెల్లించిన అవసరం లేదన్నారు. 10 సంవత్సరాల వరకు వాటర్ పై పన్ను లేదన్నారు. 15 సంవత్సరాల పాటు పూర్తి రాయితీ ఎలక్ట్రిసిటీ కల్పిస్తున్నారు. 2.9 కిలోమీటర్ల వరకు క్యాపిటల్ పోర్టు నిర్మాణానికి అనుమతి ఇచ్చారన్నారు. ప్రైవేటు మిట్టల్ పై ఉన్న ప్రేమ, ప్రభుత్వ రంగం విశాఖ స్టీల్ ప్లాంట్ పై ఎందుకు లేదని ప్రశ్నించారు. ఇప్పటికైనా కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు వైఖరి మార్చుకొని, విశాఖ స్టీల్ ప్లాంట్ ను రక్షించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిఎఫ్ టియు జాతీయ అధ్యక్షుడు ఎన్. కనకరావు, సిపిఎం మాజీ ఫ్లోర్ లీడర్ బి.గంగా రావు, సిఐటియు విశాఖ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్ కె ఎస్ వి కుమార్, అధ్యక్షులు కె.ఎం శ్రీనివాస్,ఎఐటియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి జి.ఎస్.జె అచ్యుత్ రావు, రాష్ట్ర కార్యదర్శి పడాల రమణ,స్టీల్ ప్లాంట్ సిఐటియు యూనియన్ నాయకులు అయోధ్య రామ్,ఎన్.రామస్వామి,ఐఎన్ టియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి బి. నాగభూషణం,ఐఎఫ్ టియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం.వెంకటేశ్వర్లు,వైఎస్ఆర్ టియుసి యూనియన్ నాయకులు, మాజీ కార్పొరేటర్ పి.వి.సురేష్ తదితరులు పాల్గొన్నారు.

## అజేయమైన శక్తిగా అమరావతి ఆవిర్భావం

- కుట్రలు, కుతంత్రాలకు ఇక చెక్ పడినట్లే
- అమరావతి బిల్లుపై పవన్ హర్షం

**అమరావతి, ఏప్రిల్ 2 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** ఆంధ్రప్రదేశ్ రాజధానిగా అమరావతికి చట్టబద్ధత కల్పించే బిల్లు రాజ్యసభలోనూ ఆమోదం పొందడం పట్ల డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ హర్షం వ్యక్తం చేశారు. గత కొన్నెళ్లుగా రాజధాని ఉనికిపై సాగిన కుట్రలు, అపోహలు, న్యాయపరమైన చిక్కులన్నింటినీ అధిగమించి.. నేడు పార్లమెంట్ సాక్షిగా అమరావతి అజేయమైన శక్తిగా అవతరించిందని చెప్పారు. అమరావతి ఇక అజేయమని, అభివృద్ధి పథంలో దూసుకుపోతుంది. అమరావతి అభివృద్ధికి బలమైన తోడ్పాటు అందిస్తూ, చట్టబద్ధత బిల్లును విజయవంతంగా ముందుకు తీసుకెళ్లిన ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, కేంద్ర హోంమంత్రి అమిత్ షాకి ప్రత్యేక ధన్యవాదాలు'. ఈ చరిత్రాత్మక విజయాన్ని పురస్కరించుకొని రాష్ట్ర వ్యాప్తంగా కూటమి పక్షాలు నిర్వహించే సంబరాల్లో జనసేన నాయకులు, కార్యకర్తలు భాగస్వామ్యం కావాలి. ప్రతి ఒక్కరూ తమ ఇళ్ల ముందు, పార్టీ కార్యాలయాల వద్ద దీపాలు వెలిగించి అమరావతి విజయోత్సవాన్ని జరుపుకోవాలి' అని పవన్ కళ్యాణ్ పిలుపునిచ్చారు. లోక్‌సభ అనంతరం రాజ్యసభలోనూ బిల్లు నెగ్గడంతో రాజధానిగా అమరావతికి ఇక ఎదురులేదని, ఇది ఐదు కోట్ల ఆంధ్రులు గర్వించ దగ్గ శుభపరిణామమని అన్నారు. డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ మాట్లాడుతూ.. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర రాజధాని అమరావతికి చట్టబద్ధత కల్పించే బిల్లుకు లోక్ సభ అమోదం పొందటంతో రాష్ట్ర ప్రజలందరూ సంతోషంలో ఉన్నారు. వారంతా ఎంతో గర్వించే క్షణాలు. ఈ చట్టబద్ధతతో అమరావతి శాశ్వత రాజధానిగా నిలుస్తుంది. లోక్‌సభలో ఈ బిల్లుకు మద్దతు తెలియజేసిన ఇతర పార్టీలు, ఎంపీలకు ధన్యవాదాలు. అమరావతికి చట్టబద్ధత లభించడం జీర్ణించుకోలేక విషం చిమ్ముతున్నవారికి రాబోయే రోజుల్లో ప్రజలు గొప్ప గుణపాఠం నేర్పిస్తారు.

## పోలవరం పనులు పరిశీలించిన మంత్రి నిమ్మల

### ప్రాజెక్ట్ డయాఫ్రం వాల్ పూర్తి అయినట్లు ప్రకటన
### ఇంజనీర్లు, తదితరుల కృషికి మంత్రి అభినందనలు

**ఏలూరు, ఏప్రిల్ 2 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** ఆంధ్రుల జీవనాడి పోలవరం ప్రాజెక్టు డయాఫ్రం వాల్ నిర్మాణం పూర్తయిందని రాష్ట్ర భారీ నీటిపారుదల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు తెలిపారు. 2027 కల్లా పోలవరం ప్రాజెక్టు పూర్తి చేసే లక్ష్యంతో డయాఫ్రం వాల్ పూర్తయి మెయిన్ డ్యామ్ పనులు జరుగు తున్నాయన్నారు. గురువారం పోలవరం ప్రాజెక్టు వద్ద పూర్తయిన డయాఫ్రం వాల్ పనులను మంత్రి నిమ్మల రామానాయుడు పరిశీలించారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ.. 1,372 మీటర్ల పొడవైన డయాఫ్రం వాల్ నిర్మాణాన్ని 440 రోజుల్లో పూర్తి చేశామన్నారు. గత టీడీపీ ప్రభుత్వంలో 18 నెలలు శ్రమించి నిర్మించిన డయాఫ్రం వాల్‌ను గత జగన్ ప్రభుత్వం విధ్వంసం చేసిందని గుర్తు చేశారు. జగన్ విధ్వంసానికి కొత్త డయాఫ్రం వాల్ నిర్మాణానికి అదనంగా మరో రూ.1000 కోట్లు ఖర్చు అయిందని మంత్రి నిమ్మల రామానాయుడు తెలిపారు. 2025 జనవరి 18వ తేదీన ఈ డయాఫ్రం వాల్ నిర్మాణ పనులు ప్రారంభించి.. ఈ రోజు పూర్తి చేశామని వివరించారు. 2020 ఆగస్టులో వచ్చిన వరదలకు డయాఫ్రం వాల్ దెబ్బతింటే, 2021 జూన్, అదే ఏడాది డిసెంబర్, 2022 జూన్‌లో దీనిని పూర్తి చేస్తామని వైఎస్ జగన్ అసెంబ్లీలో చేసిన ప్రకటనలను ఈ సందర్భంగా మంత్రి ప్రస్తావించారు. ప్రాజెక్టుకు డయాఫ్రం వాల్ ఉందో లేదో తెలియని స్థితిలో నాటి ముఖ్యమంత్రి జగన్ ఉన్నారని వ్యంగ్యంగా అన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే విధ్వంసమైన పోలవరం ప్రాజెక్టు పనులను సీఎం చంద్రబాబు గాడిలో పెట్టారని మంత్రి నిమ్మల రామానాయుడు వెల్లడించారు. ప్రాజెక్టు డయాఫ్రం వాల్ పూర్తి కావడంతో.. ఈ నిర్మాణంలో భాగమైన ఇంజనీర్లు, సిబ్బందిని మంత్రి నిమ్మల రామానాయుడు సన్మానించి.. వారికి స్వీట్లు తినిపించారు.

## అమరావతి బిల్లు పాస్ కావడం.. ఎంపిగా ఉండడం నా అదృష్టం: ఎంపి కేశినేని

**అమరావతి, ఏప్రిల్ 2 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** రాజధాని అమరావతి చట్టబద్ధత బిల్లు పార్లమెంట్ ఉభయ సభల్లో ఆమోదం పొందడంతో ఐదు కోట్ల ఆంధ్రులలో పట్టలేని ఆనందాన్ని నింపుతుందని విజయవాడ ఎంపీ కేశినేని చిన్ని తెలిపారు. పార్లమెంట్‌లో రాజధాని అమరావతి బిల్లు చట్టబద్ధత పొందడం పట్ల ఆయన హర్షం వ్యక్తం చేశారు. ఈ బిల్లు ఆమోదానికి కృషి చేసిన ప్రధాని మోదీకి ఈ సందర్భంగా ఆయన తెలుగు ప్రజల పక్షాన ధన్యవాదాలు తెలిపారు. గురువారం అమరావతిలో ఎంపీ కేశినేని చిన్న విలేకర్లతో మాట్లాడుతూ.. అమరావతి బిల్లు పార్లమెంటులో ఆమోదానికి వచ్చే సమయంలో ఆ ప్రాంతంలోని విజయవాడ ఎంపీగా తాను ఉండడం సంతోషంగా ఉందన్నారు. ఈ బిల్లు చట్టబద్ధతకు కృషి చేసిన సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్, యువ నేత, మంత్రి నారా లోకేశ్‌కు కేశినేని చిన్ని ధన్యవాదాలు తెలిపారు.


ట్రూహోమ్ ఫైనాన్స్ లిమిటెడ్
(మునుపటి పేరు: శ్రీరామ్ హౌసింగ్ ఫైనాన్స్ లిమిటెడ్)

Truhome FINANCE

రిజిష్టర్డ్ ఆఫీస్ : శ్రీనివాస టవర్, 1వ అంతస్తు, డోరు నెం.5, పాత నెం.11, 2వ లేను, సెనటోఫ రోడ్డు, అల్వార్పేట, తేనం పేట చెన్నై-600018.
ప్రధాన కార్యాలయము: లెవెల్-3, వాకర్ట్ టవర్స్, ఈస్టింగ్ సి-2, జి బ్లాక్, బాంద్రా కుర్లా కాంప్లెక్స్, బాంద్రా (ఈస్ట్), ముంబాయి-400 051, వెబ్‌సైట్: www.truhomefinance.in

భౌతిక స్వాధీనం నోటీసు

ఈ , క్రింద సంతకం చేసిన వ్యక్తి ట్రూహోమ్ ఫైనాన్స్ లిమిటెడ్ (గతంలో శ్రీరామ్ హౌసింగ్ ఫైనాన్స్ లిమిటెడ్) యొక్క అధీకృత అధికారిగా సెక్యూరిటైజేషన్ మరియు పునర్నిర్మాణం ఆఫ్ ఫైనాన్షియల్ ఆస్తులు మరియు సెక్యూరిటీ ఇంట్రెస్ట్ చట్టం, 2002 (చెప్పబడిన చట్టం) నిబంధనల ప్రకారం మరియు సెక్యూరిటీ ఇంట్రెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) నియమాలు, 2002 (చెప్పబడిన నియమాలు) యొక్క నిబంధన 3 తో చదవబడిన చట్టంలోని సెక్షన్ 13(12) కింద ఇవ్వబడిన అధికారాలను వినియోగించి రుణగ్రహీతలకు డిమాండ్ నోటీసులు జారీ చేశారు, వీటి వివరాలు క్రింద ఇవ్వబడిన పట్టికలో ఇవ్వబడినాయి డిమాండ్ నోటీసులలో పేర్కొన్న మొత్తాన్ని తిరిగి చెల్లించవలసిందిగా కోరటమైనది

రుణగ్రహీతలు మొత్తాన్ని తిరిగి చెల్లించడంలో విఫలమైనందున, కింద సంతకం చేసిన అధీకృత అధికారి ట్రూహోమ్ ఫైనాన్స్ లిమిటెడ్ (గతంలో శ్రీరామ్ హౌసింగ్ ఫైనాన్స్ లిమిటెడ్) చట్టంలోని సెక్షన్ 13(4) కింద అతనికి ఇవ్వబడిన అధికారాలను ఉపయోగించి క్రింద వివరించిన ఆస్తిని 31/03/2026 వ తేదీన భౌతికంగా స్వాధీనం చేసుకున్నారని రుణగ్రహీతలకు మరియు ప్రజలకు నోటీసు ఇవ్వబడింది. ముఖ్యంగా రుణగ్రహీతను మరియు సాధారణం ప్రజలను ఈ ఆస్తితో వ్యవహరించవద్దని ఇందుమూలంగా హెచ్చరిస్తున్నాము మరియు ఆస్తితో ఏదైనా లావాదేవీ ట్రూహోమ్ ఫైనాన్స్ లిమిటెడ్ (గతంలో శ్రీరామ్ హౌసింగ్ ఫైనాన్స్ లిమిటెడ్) యొక్క ఛార్జీకి అనగా క్రింద పేర్కొన్న మొత్తానికి వడ్డీతో సహా లోబడి ఉంటుంది, సెక్యూర్డ్ ఆస్తులను తిరిగి పొందేందుకు అందుబాటులో ఉన్న సమయానికి సంబంధించి, చట్టంలోని సెక్షన్ 13లోని సబ్-సెక్షన్ (8)లోని నిబంధనలపై రుణగ్రహీత దృష్టి కి తీసుకు రావటమైనది

రుణగ్రహీత పేరు మరియు చిరునామా

శ్రీ టోకల మణికంఠ, S/O శ్రీ వెంకటేశ్వర్లు
శ్రీమతి టోకల నాగ సుచరిత, W/O శ్రీ మణికంఠ టోకల
ఇద్దరూ నివాసం: డోర్ నెం. 1-33, దావులూరి పాలెం, దావులూరు, వై.ఎస్.ఆర్ విగ్రహం సమీపంలో, కొల్లిపార, గుంటూరు, ఆంధ్రప్రదేశ్, భారతదేశం – 522304

డిమాండ్ నోటీసు ప్రకారం బకాయి మొత్తం

డిమాండ్ నోటీస్ తేదీ – 15-12-2025
లోన్ అకౌంట్ నంబర్ SMLHVJWD0000040కు సంబంధించిన డిమాండ్ నోటీస్ మొత్తం రూ. 7,50,460/- (ఏడు లక్షల యాభై వేల నాలుగు వందల అరవై రూపాయలు మాత్రమే) 31-12-2025 నాటికి ఉంది.

తనఖా ఆస్తి వివరాలు

121 చ.గజాల విస్తీర్ణం గల ఆస్తి, ఇల్లు నెం. 1-40 (సమీపం), డోర్ నెం. 1-33, సర్వే నంబర్ 535-2లో ఉండి, దావులూరు గ్రామం, కొల్లిపార ఉప-రిజిస్ట్రేషన్ పరిధిలో ఉన్నది. సరిహద్దులు ఇలా ఉన్నాయి: పడమర: గంటి ధనలక్ష్మి సైట్ – 71 లింకులు ఉత్తరం: 14 లింకుల వెడల్పు ఉన్న జాయింట్ మార్గం – 36 లింకులు దక్షిణం: పల్లిశెట్టి శ్రీలక్ష్మి తదితరుల 7వ ఐటెం సైట్ – 36 లింకులు , తూర్పు: వాసా రామారావు సైట్ – 71 లింకులు అలాగే 41.5 చ.గజాల విస్తీర్ణం గల ఆస్తి, ఇల్లు నెం. 1-40 (సమీపం), డోర్ నెం. 1-33, సర్వే నంబర్ 535-2లో ఉండి, దావులూరు గ్రామం, కొల్లిపార ఉప-రిజిస్ట్రేషన్ పరిధిలో ఉన్నది. సరిహద్దులు ఇలా ఉన్నాయి: పడమర: కొత్తబొమ్మువారిపాలెం వెళ్లే రహదారి – 14 లింకులు ఉత్తరం: గుర్రాల సులోచన భూమి – 365 లింకులు , దక్షిణం: 1వ ఐటెం సైట్ మరియు గుర్రాల వెంకటేశ్వరరావు తదితరుల సైట్ – 363 లింకులు , తూర్పు: డోర్ నెం. 581 డొంక – 14 లింకులు ఈ ఆస్తి కొల్లిపార ఉప-రిజిస్ట్రేషన్ జిల్లా మరియు గుంటూరు రిజిస్ట్రేషన్ జిల్లాలో ఉంది.

స్థలం: గుంటూరు
తేది: 31-03-2026

సం/- అధీకృత అధికారి – ట్రూహోమ్ ఫైనాన్స్ లిమిటెడ్
(మునుపటి పేరు శ్రీరామ్ హౌసింగ్ ఫైనాన్స్ లిమిటెడ్)

## నేటి మనదేశమ్ సంపాదకీయం

# జగన్..... చపలచిత్త రాజకీయాలు!

ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి రాజకీయాలు సూస్తుంటే ..ఇంతటి అపరిపక్వ రాజకీయ నేతను చూసి ఉండమేమో అనిపిస్తుంది. చంద్రబాబు మీద వ్యతిరేకత ఉన్నవారు సైతం రాజధాని విషయంలో వ్యతిరేకించడం లేదు. ఏ విషయంలోనూ స్పష్టత లేని జగన్ ఐదేళ్ల పాటు ప్రజలు ఇచ్చిన అధికారాన్ని దుర్వినియోగం చేశారు. అతి తక్కువ సమయంలో సిఎంగా ప్రజలు ఆదరిస్తే, దానిని అద్భుత అవకాశంగా తీసుకుని, దార్శనికతను ప్రదర్శించాల్సిన జగన్, తన ఫ్యాక్షన్ రాజకీయతనుజోడించి అభాసుపాలయ్యారు. అధికారంలో ఉండగా మూడు రాజధానులు అంటూ, రాజధాని రైతులను రాచిరంపాన పెట్టారు. అమరావతి ని వేశ్యల రాజధాని అన్నారు. అదో కమ్మ సామ్రాజ్యం అన్నారు. మూడు రాజధానులలంటూ ఊదరగొట్టి, అసలు రాజధాని లేకుండా ఐదేళ్లు కాలం గడిపారు. ఇప్పుడేమో మావిగన్ అంటూ జగన్ కొత్త పల్లవి అందుకున్నారు. ఇవన్నీ చూస్తుంటే జగన్‌లో ఓ అపరిచితుడు ఉన్నాడా అన్న అనుమానాలు కలుగు తున్నాయి. రాజధాని అమరావతి రైతులకు న్యాయం జరగడం లేదంటున్న వ్యక్తి, తన సొంతింట్లో సొంత చెల్లెలికి మాత్రం న్యాయం చ ఏయడం లేదు. హక్కుగా ఉన్న ఆస్తిని పంచడం లేదు. తల్లి చెప్పినా వినడం లేదు. అంతెందుకు రాజధాని విషయంలో ఏం మాట్లాడుతున్నారో ఆయనకైనా అర్థం అవుతందా అన్నది అర్థం కావడం లేదు. మూడు రాజధానులు అన్నారు. అసలు రాజధాని అవసరం లేదంటున్నాడు. మావిగన్ అంటున్నాడు. అంటే చిత్తశుద్ధి, స్థిర సంకల్పం లేని రాజకీయ నేతగా జగన్‌ను చూడాలి. ఇలాంటి వారు అధికారంలో ఉండగా ఎంతగా తెగించారో చూశాం. అధికారంలో ఉన్నప్పుడు మూడు రాజధానుల పాట పాడిన వైసీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్.. ఇప్పుడు 'ప్లాన్–బి' పేరుతో కొత్త పల్లవి అందుకున్నారు. విశాఖలో ఎగ్జిక్యూటివ్ క్యాపిటల్ నచ్చకపోతే.. ప్లాన్–బీ కింద మచిలీపట్నం (మా) –విజయవాడ (వి)–గుంటూరు (గన్) నగరాలను రాజధానిగా అభివృద్ధి చేయొచ్చని సెలవిచ్చారు. దీనికి ఎంచక్కా 'మావిగన్' అని పేరు పెట్టొచ్చన్నారు. 'గన్'లో తన పేరు ఉన్నందున, అది నచ్చకపోతే ఇంకోపేరు పెట్టుకోవచ్చని కూడా సలహా ఇచ్చారు. మచిలీపట్నం–విజయవాడ–గుంటూరు మధ్య 110 కిలోమీటర్ల హైవే ప్రాంతం పరిధిలో 110 ఎకరాల్లో రాజధాని నగరాన్ని ఏర్పాటు చేయొచ్చని జగన్ పేర్కొన్నారు. 'మావిగన్'పై తన అభిప్రాయాన్ని విన్నాక .. రాష్ట్ర ప్రజలు తనతో ఏకీభవిస్తారని విశ్వాసం వ్యక్తం చేశారు. అమరావతి మాత్రం ఆచరణ సాధ్యం కాదని తేల్చేశారు. భవిష్యత్తులో తమ ప్రభుత్వం వచ్చాక అసెంబ్లీలో చట్ట సవరణ ద్వారా రాజధానిని మార్చేస్తామని కూడా ప్రకటించారు. గతంలో తుగ్లక్ కూడా ఇలాగే చేశారు. ఇష్టం వచ్చినట్లుగా రాజధానిని మార్చేశారు. ఇప్పుడు జగన్ చేస్తున్న లేదా చెబుతున్నది అలాగే ఉంది. అంతెందుకు అసలు రాష్ట్రాలకు రాజదాని అసవరం లేదని సెలవిచ్చారు. గతంలో ఆయనగారు తాను అంటే సిఎం ఎక్కడ ఉంటే అదే రాజధాని అన్నారు. దీనిపై మాజీమంత్రి సోమిరెడ్డి సెటైర్లు వేశారు. లాట్రిన్‌లో ఉంటే అదే రాజధాని అవుతుందనుకోవాలా అని అన్నారు. రాజ్యాంగంలో దేశ రాజధానిపై నిర్వచనం ఉందే తప్ప.. రాష్ట్రాల రాజధాని ప్రస్తావనే ఎక్కడా లేదని జగన్ చెప్పడం ఆయన అవివేకానికి పరాకాష్టగా చెప్పుకోవాలి. రాజధానిగా అమరావతికి చట్టబద్ధత కల్పిస్తూ పార్లమెంటులో చట్ట సవరణ చేసినా నిలువదంటున్నారు. భవిష్యత్‌లో ప్రజాభీష్టం మేరకు ఏర్పడే రాష్ట్రప్రభుత్వం.. రాజధానిని అమరావతి నుంచి మారుస్తూ చట్టసవరణ చేయవచ్చని కూడా సెలవిచ్చారు. అమరావతికి తాను ఏనాడూ వ్యతిరేకం కాదని, అందుకే శాసన రాజధానిగా ఏర్పాటు చేశానని తెలిపారు. అమరావతికి ఏ ఒక్కరూ వ్యతిరేకం కాదని, రాజధాని పేరిట చేస్తున్న అవినీతికే వ్యతిరేకమని చెప్పారు. అమరావతిలో చంద్రబాబు, పవన్ కల్యాణ్, లోకేశ్ కంటే తానే ఎక్కువ కాలం కాపురం చేశానని జగన్ చెప్పుకున్నారు. తనకు అమరావతిపై అభిమానం ఉందనేందుకు చంద్రబాబు కంటే ముందుగానే తాడేపల్లిలో సొంత ఇల్లు కట్టుకున్నానని.. ప్రస్తుతం అదే భూమిపై ఉండడమే సాక్ష్యమన్నారు. ఇలా అర్థంపర్థం లేని వ్యాఖ్యలు, వాదనలు జగన్ రాజకీయ వ్యక్తిత్వాన్ని ప్రతిబింబిస్తున్నాయి. అతనిలోని నిరంకుశ విధానాలు బటయకు వస్తున్నాయి. అధికారంలో ఉంటే ఎంతటి విధ్వంసానికి అయినా తెగిస్తారని ప్రజావేదిక కూల్చివేతతో చూపారు. మద్యపాన నిషేధం పేరుతో మద్యంపై దందా చేశారు. ఒక్కటేమిటి సకల వ్యవస్థలను భ్రష్టు పట్టించి, బటన్ నొక్కుడుతో రాష్ట్రాన్ని అధోగతి పాలుచేశారు. అప్పులు చేసి ఆర్థిక వ్యవస్థను విధ్వంసం చేశారు. విశాఖ భీమిలిలో ప్యాలెస్‌లు కట్టుకుని తన రాజరిక పోకడలను చాటారు. అందుకే ఇప్పుడు జగన్ తననకున్న కాస్తా ఇమేజ్‌ను బజారున పడేసుకున్నారు. అమరావతికి చట్టబద్ధత కల్పించే బిల్లును వ్యతిరేకించడం ద్వారా వైసీపీతో పాటు జగన్ జాతీయ రాజకీయాల్లో భ్రష్ట చరిత్రను లిఖించుకున్నారు. ఆంధ్రప్రదేశ్ రాజధానికి సంబంధించిన బిల్లును.. వైసీపీ తప్ప అన్ని పార్టీలూ సంపూర్ణంగా సమర్థించాయి. బిల్లును వ్యతిరేకించొద్దు.. మద్దతు ఇవ్వొద్దన్నది తొలుత వైసీపీ తీసుకున్న నిర్ణయం. అయితే కాంగ్రెస్ తెలంగాణ ఎంపీలు సైతం అమరావతికి మద్దతిస్తూ మాట్లాడడంతో వైసీపీ నాయకత్వానికి దిక్కుతోచలేదు. చివరకు వ్యతిరేకిస్తూ ఆ పార్టీ ఎంపీలు వాకౌట్ చేశారు. ఈ సందర్భంగా సీఎం చంద్రబాబును విమర్శిస్తూ వైసీపీ లోక్‌సభాపక్ష నేత మిథున్‌రెడ్డి చేసిన ప్రసంగాన్ని గానీ.. ఆ పార్టీ ఎంపీల వాకౌట్‌ను గానీ సభలో ఎవరూ పట్టించుకోలేదు. పార్లమెంట్ బడ్జెట్ సమావేశాలు ముగుస్తున్న వేళ, అకస్మాత్తుగా బిల్లును తెరపైకి తేవడం.. దానికి ముందే అసెంబ్లీలో తీర్మానం ఆమోదించి పంపాలని స్వయంగా ప్రధాని కార్యాలయం రాష్ట్రప్రభుత్వానికి సూచించడం.. ఆగమేఘాలపై కూటమి ప్రభుత్వం అత్యవసరంగా అసెంబ్లీని సమావేశపరచి తీర్మానాన్ని ఏకగ్రీవంగా ఆమోదించడం.. శాసనమండలిలో పెట్టనవసరం లేదని తేల్చడం.. ఆ వెంటనే కేంద్రం బిల్లును తీసుకు రావడం.. శరవేగంతో జరిగిన ఈ పరిణామాలతో జగన్ ఉక్కిరిబిక్కిరి అయ్యారని వేరుగా చెప్పాల్సిన పనిలేదు. ఓవైపు మతపరమైన, కుటుంబపరమైన వివాదాలు జగన్‌ని చుట్టుముడుతున్న వేళ, ఇప్పుడు అమరావతితో రాజకీయంగా సమాధి తవ్వుకున్నట్లుగానే భావించాలి. వర్తమాన రాజకీయాలలో జగన్ తనవికృత రాజకీయ మేథను ప్రదర్శించి మరొకరు సాటిరారని ప్రచారం చేసుకున్నారు. ఇలాంటి రాజకీయ నేతల వల్ల ప్రజలకు కానీ, రాష్ట్రానికి కానీ మేలు జరగదు. ఫక్తు ఫూడల్ వ్యవస్థకు పునాదిగా జగన్ రాజకీయ ఆలోచనలు అద్దం పడుతున్నాయి.

## రోడ్డు ప్రమాదంలో అన్నదమ్ముల మృతి

**హైదరాబాద్,ఏప్రిల్2(ఆర్ఎన్ఎ):** రోడ్డు ప్రమాదంలో ఇద్దరు అన్నదమ్ములు దుర్మరణం చెందారు. ఈ విషాదకర సంఘటన హనుమకొండ జిల్లా ధర్మసాగర్ మండలం ముప్పారంలో చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళ్తే.. జనగామ జిల్లా తరిగొప్పుల మండలం నర్సాపూర్‌కు చెందిన ఓ కుటుంబం కారులో వెళుతుండగా అదుపు తప్పి చెట్టును ఢీకొట్టారు. ఈ ప్రమాదంలో ఇద్దరు సోదరులు అక్కడికక్కడే మృతి చెందగా మరో ఐదుగురు గాయపడ్డారు. గమనించిన స్థానికులు క్షతగాత్రులను హాస్పిటల్‌కు తరలించారు. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

# దేశ పరిపాలనలో సరికొత్త అధ్యాయం మిషన్ కర్మయోగి

**విజయవాడ, ఏప్రిల్ 2 (పీఐబి):** రాజస్థాన్‌లోని ఒక మారుమూల ప్రాంతంలో ఒక జిల్లా కలెక్టర్‌కు తనకు అంతగా అవగాహన లేని ఒక ప్రతిష్టాత్మక సంక్షేమ పథకం బాధ్యతను అప్పగించారనుకుందాం. ఒక దశాబ్దం క్రితం అయితే, ఆయనకు ఉన్న ఏకైక మార్గం పాతబడిపోయిన ప్రభుత్వ మాన్యువల్‌ను తిరగేయడం లేదా బిజీగా ఉండే సీనియర్ అధికారి కోసం వేచి చూడటం, లేదా ఎప్పుడో ఏడాది తర్వాత వచ్చే శిక్షణ కార్యక్రమం కోసం ఎదురుచూడటం. కానీ నేడు, ఆయన తన మొబైల్‌లో iGOT (ఇంటిగ్రేటెడ్ గవర్నమెంట్ ఆన్‌లైన్ ట్రైనింగ్) ప్లాట్‌ఫారమ్‌లోకి లాగిన్ అయి, నిమిషాల్లోనే తన అవసరానికి తగ్గట్టుగా రూపొందించిన కోర్సును నేర్చుకుంటున్నారు. సాయంత్రానికల్లా పూర్తి ఆత్మవిశ్వాసంతో ఆ పథకంపై మొదటి లబ్ధిదారుల సమావేశాన్ని నిర్వహిస్తున్నారు. ఈ మార్పు పైకి చిన్నదిగా అనిపించినా, ఇది ఒక గొప్ప విప్లవం. ఐదేళ్ల క్రితం ప్రారంభమైన 'మిషన్ కర్మయోగి' సాధిస్తున్న నిశ్శబ్ద విప్లవం ఇది. ఆర్భాటాలు లేకుండా, నవ భారత నిర్మాణానికి అవసరమైన నూతన తరహా ప్రభుత్వ అధికారులను ఇది తీర్చిదిద్దుతోంది.ప్రధానమంత్రి దార్శనికతలో 2047 నాటి 'వికసిత భారత్' అనేది కేవలం చేరుకోవాల్సిన గమ్యం కాదు; అది మనం నిర్మించుకోవాల్సిన అద్భుతం. ఈ నిర్మాణంలో పెట్టుబడి, సాంకేతికత లేదా విధానాల కంటే ముఖ్యమైనది ప్రతిరోజూ దేశం కోసం పనిచేసే సుమారు 3.5 కోట్ల మంది ప్రభుత్వ ఉద్యోగుల సామర్థ్యం. స్వతంత్ర భారత చరిత్రలో చాలా కాలం పాటు ప్రభుత్వ అధికారుల సామర్థ్యాన్ని పెంపొందించే నమూనా కేవలం అప్పుడప్పుడు జరిగే శిక్షణలకే పరిమితమైంది. దీనిని 'ఎపిసోడిక్' నమూనాగా పిలవవచ్చు. అంటే, ఒక యువ అధికారి సర్వీసులో చేరినప్పుడు ప్రారంభంలో కొంత అధికారిక శిక్షణ పొందుతారు, ఆపై తన కెరీర్ మధ్యలో ఎక్కడో ఒకట్రెండు కోర్సులు చేస్తారు. మిగతా సమయమంతా పనులు చేస్తూ, ఇతరులను చూసి నేర్చుకోవడమే ప్రాధాన్యంగా ఉండేది. స్థిరంగా, నెమ్మదిగా సాగే ప్రపంచంలో ఈ పద్ధతి సరిపోయింది. కానీ, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, వాతావరణ మార్పుల ముప్పు, జనాభా ఒత్తిడి, వేగంగా మారుతున్న సాంకేతిక మార్పుల యుగంలో ఈ పాత పద్ధతి ఏమాత్రం సరిపోదు. పాలనాపరమైన సవాళ్లు ఎదురవుతున్న వేగం ముందు, పాత తరహా శిక్షణా వ్యవస్థల స్పందన చాలా వెనుకబడిపోయింది. ఈ అసమతుల్యతకు పరిష్కారంగానే 'మిషన్ కర్మయోగి' రూపుదిద్దుకుంది. 2021లో ప్రారంభమైన ఈ మిషన్, అదే ఏడాది ఏప్రిల్‌లో స్థాపించబడిన కెపాసిటీ బిల్డింగ్ కమిషన్ ద్వారా సంస్థాగతంగా బలోపేతం చేయబడింది. భారత సివిల్ సర్వీసెస్ అభ్యాస సంస్కృతిని పూర్తిగా మార్చాలనే అత్యంత ప్రతిష్టాత్మక లక్ష్యంతో ఇది అడుగులు వేసింది. కేవలం అప్పుడప్పుడు జరిగే, నిబంధనల అమలుకే పరిమితమైన శిక్షణ నుండి.. నిరంతరంగా సాగే, బాధ్యతలకు అనుగుణమైన, స్వయం ప్రేరిత ఎదుగుదల దిశగా ఈ ప్రయాణం సాగుతోంది. కమిషన్ వివరించినట్లుగా, ఇది కేవలం నిబంధనలను పాటించే ఒక 'కర్మచారి' స్థాయి నుండి.. లక్ష్యం, సేవ, ఉత్కృష్టతతో కూడిన నిబద్ధత గల 'కర్మయోగి'గా మారే ఒక గొప్ప పరివర్తన. మిషన్ కర్మయోగి ప్రారంభమై ఐదేళ్లు పూర్తయిన తర్వాత కనిపిస్తున్న గణాంకాలు అద్భుతమైన ఫలితాలను వెల్లడిస్తున్నాయి. ప్రస్తుతం 1.5 కోట్లకు పైగా ప్రభుత్వ అధికారులు ఐ+గాట్ ప్లాట్‌ఫారమ్‌లో చురుగ్గా నేర్చుకుంటున్నారు---ప్రారంభంలో ఈ సంఖ్యను ఊహించడం కూడా అసాధ్యంగా అనిపించేది. 4,600 కంటే ఎక్కువ నైపుణ్య ఆధారిత కోర్సుల ద్వారా, ఈ అధికారులు ఇప్పటివరకు 8.3 కోట్లకు పైగా కోర్సులను విజయవంతంగా పూర్తి చేశారు. గడచిన నేషనల్ లెర్నింగ్ వీక్‌లో మాత్రమే, 4.5 మిలియన్ గంటల కోర్సు నమోదులు, 3.8 మిలియన్ గంటల వాస్తవిక అభ్యాసం నమోదైంది. ఇవి కేవలం గణాంకాలు మాత్రమే కావు. ప్రతి గంట వెనుక భారత్ లోని ఎవరో ఒక ప్రభుత్వ ఉద్యోగి తమ తోటి పౌరులకు మెరుగైన సేవలు అందించేందుకు తమ సొంత నైపుణ్యాలను మెరుగుపరుచుకుంటున్నారని అర్థం. ఐ+గాట్ ప్లాట్‌ఫారమ్‌ను నిజంగా ఒక పరివర్తనాత్మక శక్తిగా మార్చింది కేవలం దాని విస్తృతి మాత్రమే కాదు, సామాన్యులకు కూడా అది అందుబాటులో ఉండేలా తీర్చిదిద్దిన దాని నిర్మాణ శైలి. ఇది ఎప్పుడైనా, ఎక్కడైనా, స్మార్ట్‌ఫోన్ లేదా డెస్క్‌టాప్‌లో అనేక భాషల్లో అందుబాటులో ఉంటుంది. అంతేకాకుండా, అభ్యాసకుడి వృత్తిపరమైన బాధ్యతలకు అనుగుణంగా ఇది వ్యక్తిగతీకరించబడింది. పాలనలో సాధనాలను ఎలా ఉపయోగించాలి లేదా కొత్త ఆర్థిక నిబంధనలను ఎలా అర్థం చేసుకోవాలి అనే అంశాలపై కంటెంట్ ఎప్పటికప్పుడు తాజాగా ఉండటానికి వీలుగా ప్రతి మూడు నుండి ఆరు నెలలకు కోర్సులు అప్‌డేట్ చేయబడతాయి. ఈ ప్లాట్‌ఫారమ్ మూలన పడి ధూళి పేరుకుపోయిన డిజిటల్ లైబ్రరీ కాదు, ఇది ఒక సజీవమైన, నిరంతరం మారుతున్న అభ్యాస పర్యావరణ వ్యవస్థ. ఒక గిరిజన జిల్లాలోని జూనియర్ అంగన్‌వాడీ కార్యకర్తకు ఇది ఎంతటి మేలు చేస్తుందో ఒక్కసారి ఆలోచించండి; ఆమె తన సొంత భాషలోనే శిశు పోషణ అంచనాకు సంబంధించిన తాజా ప్రోటోకాల్‌లను వివరిస్తూ ఒక మాడ్యూల్‌ను అందుకుంటుంది. శిక్షకుడు తన గ్రామానికి వచ్చే వరకు ఆమె వేచి చూడాల్సిన అవసరం లేదు. ఆమె నేర్చుకుంటుంది, వెంటనే కార్యాచరణలోకి దిగుతుంది. ఇదే ఈ మిషన్ అందించే అసలైన ప్రజాస్వామ్య ఫలం.ఈ మొత్తం వ్యవస్థకు వ్యూహాత్మక సంరక్షకుడిగా వ్యవహరిస్తున్న కెపాసిటీ బిల్డింగ్ కమిషన్ , ఒక ఆర్కిటెక్ట్, కండక్టర్ పాత్రలను ఏకకాలంలో పోషిస్తోంది. జాతీయ విధానాలను రూపొందించే సెక్రటరీ స్థాయి నుండి, గ్రామ స్థాయిలో వాటిని అమలు చేసే పంచాయతీ సిబ్బంది వరకు---అపరిమితమైన ప్రభుత్వ బాధ్యతలలో ఎవరికి ఏ నైపుణ్యాలు అవసరమో ఇది గుర్తిస్తుంది. 'నేషనల్ స్టాండర్డ్స్ ఫర్ సివిల్ సర్వీసెస్ ట్రైనింగ్ ఇన్‌స్టిట్యూషన్స్' ఫ్రేమ్‌వర్క్ ద్వారా దేశంలోని శిక్షణ సంస్థలకు నాణ్యతా ప్రమాణాలను నిర్దేశిస్తోంది.



ఇప్పటికే దేశవ్యాప్తంగా 200కు పైగా శిక్షణ సంస్థలు దీని కింద గుర్తింపు పొందాయి. 30 రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలు అధికారికంగా ఒప్పందాలు కుదుర్చుకోవడంతో, ఆయా రాష్ట్రాల అవసరాలకు తగ్గట్టుగా 'కెపాసిటీ బిల్డింగ్ ప్లాన్స్' రూపొందించేందుకు కమిషన్ కృషి చేస్తోంది. అంతేకాకుండా, 'రాష్ట్రీయ కర్మయోగి జన్ సేవా ప్రోగ్రామ్' వంటి ప్రతిష్టాత్మక కార్యక్రమాల ద్వారా, ప్రతి పౌరుడిని ఒక ముఖ్యమైన స్టేక్‌హోల్డర్‌గా పరిగణించేలా దాదాపు 10 లక్షల మంది అధికారులకు ప్రవర్తనా శిక్షణ ఇచ్చింది. ఈ మిషన్.. కేవలం సర్టిఫికెట్ల ద్వారా లేదా లెర్నింగ్ గంటల ద్వారా సులభంగా కొలవలేము. ప్రభుత్వం, పౌరుల మధ్య ఉన్న సంబంధాన్ని కేవలం ఒక లావాదేవీలా కాకుండా, 'నాగరిక్ దేవో భవ'---అంటే పౌరుడే దేవుడు, పౌరుడే అత్యున్నత అధికారి అనే భావనతో మార్చడమే మిషన్ కర్మయోగి యొక్క అత్యంత లోతైన ఆకాంక్ష. రైల్వే కౌంటర్లు, రెవెన్యూ కార్యాలయాలు, ఆరోగ్య కేంద్రాల్లో నేరుగా ప్రజలతో మమేకమయ్యే అధికారులకు ఈ ఫిలాసఫీతో శిక్షణ ఇచ్చిన తర్వాత ప్రజల నుండి వచ్చిన ఫీడ్‌బ్యాక్ ఆశ్చర్యకరంగా ఉంది. వారు పనితీరులో వేగంతో పాటు, అధికారుల మాటల్లోని ఆప్యాయతను, శ్రద్ధను, ఆ సంభాషణలోని మానవీయ స్పర్శను స్పష్టంగా గుర్తించారు. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ పరిపాలనా పనులను భారీగా ఆటోమేట్ చేస్తున్న ఈ కాలంలో, సానుభూతితో కూడిన, స్థానిక మూలాలు కలిగిన ఈ మానవీయ స్పర్శే భారతదేశ పాలనా వ్యవస్థకు అసలైన 'సూపర్ పవర్'. ఈ మిషన్ తన సాంకేతిక లక్ష్యాలతో పాటు భారతదేశపు మేధో సంపత్తిని గౌరవించడానికి కూడా స్పష్టమైన ప్రయత్నం చేసింది. 'ఇండియన్ నాలెడ్జ్ సిస్టమ్ సెల్' ద్వారా సామాజిక పాలన, వ్యవసాయం నుండి ఆర్థిక, ఆరోగ్య సంరక్షణ వరకు వివిధ రంగాల్లోని మన సంప్రదాయ జ్ఞానాన్ని శిక్షణాంశాల్లో భాగంగా మారుస్తున్నారు. దీనిని కేవలం గత స్మృతిగా కాకుండా, వర్తమానానికి ఉపయోగపడే సజీవ జ్ఞానంగా తీర్చిదిద్దుతున్నారు. ఇప్పటికే 70కి పైగా పూర్తి చేసిన కేస్ స్టడీలతో కూడిన 'అమృత్ జ్ఞాన్ కోష్' నిధి, భారతీయ సందర్భాలకు, భారతీయ పరిష్కారాలకు అనుగుణమైన పరిపాలనా విజ్ఞానాన్ని నిర్మిస్తోంది. ఆధునిక సవాళ్లను ఎదుర్కొనే క్రమంలో భారతీయ ప్రభుత్వ ఉద్యోగులు తమ సొంత నాగరికతా వారసత్వంతో ఆత్మవిశ్వాసంతో మమేకమయ్యేలా చేయడం, అంటే పరిపాలనా ఆలోచనా ధోరణిని వలసవాద పోకడల నుండి విముక్తి చేయడం అనేది ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ముఖ్యమైన ఆకాంక్షల్లో ఒకటి. మిషన్ కర్మయోగి దీనిని ఇప్పుడు ఆచరణలోకి తీసుకువస్తోంది.ఏప్రిల్ 2 నుండి 8 వరకు నిర్వహిస్తున్న 'సాధన సప్తాహ్' (నేషనల్ లెర్నింగ్ వీక్), ఈ ఐదేళ్ల ప్రయాణానికి ఒక వేడుక మాత్రమే కాదు, ఇంకా పూర్తి చేయాల్సిన పనుల పట్ల పునరంకితం కావడానికి ఒక గొప్ప అవకాశం. 'సాధన' అనే పదం ఇక్కడ అత్యంత సముచితంగా ఉంది. సాధన అంటే ఏదో ఒకరోజు అద్భుతాన్ని ప్రదర్శించడం కాదు, ప్రతిరోజూ క్రమశిక్షణతో కూడిన అభ్యాసం చేస్తూ, తన పనిపై అంకితభావంతో నైపుణ్యాన్ని సాధించడం. దాదాపు 700 మంది సీనియర్ అధికారులు ప్రత్యక్షంగా, 3,000 మందికి పైగా వర్చువల్‌గా పాల్గొంటున్న 'నేషనల్ కాన్క్లేవ్ ఆఫ్ సివిల్ సర్వీసెస్ ట్రైనింగ్ ఇన్‌స్టిట్యూషన్స్'తో మేము ఈ వారాన్ని ప్రారంభిస్తున్నాం. ఇది కేవలం ఒక వార్షికోత్సవం కాదు; రాబోయే ఐదేళ్ల ప్రయాణానికి దిక్సూచిని నిర్దేశించుకుంటాము. ప్రతి స్థాయిలో ఉన్న ప్రతి ప్రభుత్వ ఉద్యోగి ఒక నిరంతర అభ్యాసకుడిగా, పౌరుల పక్షపాతిగా, భారత ఆకాంక్షలకు ఒక నమ్మకమైన సారథిగా మారే భవిష్యత్తు వైపు మేము అడుగులు వేస్తున్నాము. సార్వత్రిక ఆరోగ్య కవరేజీ నుండి నెట్–జీరో ఉద్గారాల లక్ష్యాల వరకు, డిజిటల్ పబ్లిక్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ నుండి ప్రపంచ తయారీ రంగంలో అగ్రగామిగా నిలవడం వరకు---'వికసిత భారత్ 2047' లక్ష్యాలు కేవలం ప్రభుత్వ విధానాల వల్ల మాత్రమే సాధ్యం కావు. అవి ప్రజల ద్వారానే సాధ్యమవుతాయి. ఒక పథకాన్ని అత్యంత ఖచ్చితత్వంతో అమలు చేయగలిగే అవగాహన ఉన్న జిల్లా అధికారి ద్వారా, అత్యాధునిక స్పేషియల్ డేటా సాధనాలను ఉపయోగించగల అర్బన్ ప్లానర్ ద్వారా, మరియు తన కమ్యూనిటీ నమ్మే విధంగా ప్రజారోగ్య హెచ్చరికలను సమర్థవంతంగా చేరవేసే క్షేత్రస్థాయి ఆరోగ్య కార్యకర్త ద్వారా మాత్రమే ఇవి నెరవేరుతాయి. మిషన్ కర్మయోగి అటువంటి సమర్థవంతమైన బృందాన్ని సిద్ధం చేస్తోంది---కేవలం రేపటి కోసం కాదు, రాబోయే దశాబ్దాల కోసం. భారతదేశ పాలనా చరిత్రలోని సుదీర్ఘమైన, ఉజ్వలమైన ప్రస్థానంలో, ప్రభుత్వం చివరకు 'నేర్చుకోవడం' ఎలాగో నేర్చుకున్న అధ్యాయంగా ఇది నిలిచిపోతుంది.

**రచయిత – డాక్టర్ జితేంద్ర సింగ్**
**సైన్స్ అండ్ టెక్నాలజీ, భూ విజ్ఞాన శాఖ సహాయ మంత్రి (స్వతంత్ర బాధ్యత); ప్రధానమంత్రి కార్యాలయం, అణు ఇంధన శాఖ, అంతరిక్ష శాఖ మరియు సిబ్బంది, ప్రజా ఫిర్యాదులు అండ్ పెన్షన్ల మంత్రిత్వ శాఖ సహాయ మంత్రి**

# చికెన్ బంద్‌తో దిగివచ్చిన పౌల్ట్రీలు

### డిమాండ్లు అంగీకరించినట్లు ట్రేడర్స్ వెల్లడి



**వరంగల్,ఏప్రిల్2(ఆర్ఎన్ఎ):** చికెన్ సెంటర్ల బంద్ విజయవంతమైంది. బంద్ దెబ్బకు పౌల్ట్రీ కంపెనీలు దిగివచ్చాయి. బర్డ్ ధరను రూ.185 నుంచి రూ.125కి తగ్గించాయి. చికెన్ సెంటర్ల నిర్వాహకులకు ఇచ్చే మార్జిన్‌ను గతంలో మాదిరిగానే కిలోకు రూ.15, ఆ పైన మార్జిన్ ఇచ్చేందుకు ముందుకు వచ్చాయి. దీనితో ఉమ్మడి వరంగల్ జిల్లాలోని చికెన్ సెంటర్ల నిర్వా హకులు బంద్‌ను విరమించుకోవాలని నిర్ణయించు కున్నట్టు ఉమ్మడి వరంగల్ జిల్లా బ్రాయిలర్ ట్రేడర్స్ అసోసియేషన్ నేతలు తెలిపారు. బంద్ ప్రశాంతంగా జరిగిందని తెలిపారు. బంద్‌ను విజయవంతం చేసినందుకు చికెన్ సెంటర్ల నిర్వాహకులకు ఆయన ధన్యవాదాలు తెలిపారు. ఒక్కరోజు చికెన్ సెంటర్ల బంద్‌తో నాటు కోళ్లకు డిమాండ్ పెరిగింది. బ్రాయిలర్ కోళ్ల అమ్మకాలు లేకపోవడంతో మాంసం ప్రియులు నాటు కోళ్లను ఎక్కువగా కొనుగోలు చేసారు. దీంతో వీరు కూడా ధరలు పెంచి అమ్మారు. నాటు కోడి రేటు ఎక్కువగా ఉంటుంది కనుక సాధారణ రోజుల్లో వీటి అమ్మకాలు తక్కువగా ఉంటాయి. నాటు కోళ్లను ఇష్టపడేవారు మాత్రమే వీటిని కొనుగోలు చేస్తారు. బంద్‌తో నాటు కోళ్ల పెంపకం దారులు వీటిని మార్కెట్‌కు తరలించారు. సాధారణ ధరకన్నా కాస్త ఎక్కువైనా కొనుగోలు చేశారు. చికెన్ సెంటర్ల బంద్‌తో మాంసం విక్రయాలు కూడా 20 నుంచి 25 శాతం పెరిగినట్టు మాంసం విక్రయదారులు తెలిపారు. బుధవారం నుంచి చికెన్ సెంటర్ల బంద్ జరుగుతున్న దృష్యా ముందే మేల్కొన్న మాంసం విక్రయదారులు కాస్త ఎక్కువగానే జీవాలను కోసి ఉదయం నుంచే సిద్ధంగా ఉంచారు. చికెన్ అమ్మకాలు లేకపోవడంతో ప్రత్యామ్నాయంగా మాంసం కొనుగోలు చేయడానికి ఎక్కువ మంది మొగ్గు చూపారు. చికెన్ సెంటర్ల బంద్‌లో భాగంగా బుధవారం హైదరాబాద్ లోని ఇందిరా పార్క్ వద్ద జరిగిన మహా ధర్నాలో ఉమ్మడి వరంగల్ జిల్లా నుంచి చికెన్ సెంటర్ల నిర్వాహకులు పాల్గొన్నారు. తమ డిమాండ్లను తక్షణం పరిష్కరించాలని నినాదాలు చేశారు. అవసరమైతే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి జోక్యం చేసు కోవాలని, విధాన పరంగా చికెన్ ధరలు, కమీషన్ మార్జిన్ ధరలు నిర్ణయించాలని, చిల్లర చికెన్ వ్యాపారులు లేకుండా చేయాలని పౌల్ట్రీ కంపెనీలు చేస్తున్న కుట్రను అడ్డుకోవాలని కోరుతూ నినాదాలు చేశారు.

# బసిరెడ్డిపల్లిలో తీవ్ర విషాదం

### ఐదేళ్ల చిన్నారి దారుణ హత్య
### చంపి చెరువు కట్టపై పడేసిన దుర్మార్గులు

**నారాయణపేట,ఏప్రిల్2(ఆర్ఎన్ఎ):** జిల్లాలోని బసిరెడ్డిపల్లిలో తీవ్ర విషాదం నెలకొంది. కేవలం ఐదు సంవత్సరాల వయసున్న చిన్నారి తేజశ్రీని గుర్తు తెలియని దుండగులు అత్యంత దారుణంగా హత్య చేశారు. డెడ్ బాడీని చెరువు కట్టపై పడేశారు. ఈ ఘటనతో ఒక్కసారిగా గ్రామంలో కలకలం రేగింది. చిన్నారి డెడ్ బాడీని చూసి తల్లిదండ్రులు కన్నీరు మున్నీరుగా విలపిస్తున్నారు. నారాయణపేట జిల్లా బసిరెడ్డిపల్లికి చెందిన అంజి, శిరీష దంపతులకు ఇద్దరు సంతానం. ఒక పాప, ఒక బాబు ఉన్నారు. తల్లిదండ్రులు బతుకుదెరువు కోసం హైదరాబాద్‌లో ఉంటున్నారు.

వారి వెంట బాబును తీసుకెళ్లారు. ఐతే కూతుర్ని మాత్రం వారి తల్లిదండ్రుల దగ్గర ఉంచేశారు. దాంతో అవ్వా తాత.. చిన్నారి తేజశ్రీని జాగ్రత్తగా చూసుకుంటున్నారు. మరోవైపు చిన్నారి తేజశ్రీ కూడా అవ్వా, తాత దగ్గర బాగానే పెరుగుతోంది. రోజూ అంగన్‌వాడీకి వెళ్లడం.. తర్వాత తోటి పిల్లలతో ఆడుకుంటూ ఉండేది. అంతా బాగుంది అనుకున్న తరుణంలో గ్రామంలో ఒక్కసారిగా కలకలం రేగింది. ఎండాకాలం కావడంతో గ్రామాల్లో ఆరుబయట నిద్రించడం ఆనవాయితీ. రాత్రి అవ్వ తాతతో కలిసి తేజశ్రీ బయట నిద్రించింది. కానీ అర్ధరాత్రి సమయంలో అమ్మాయి వారి పక్కలో లేకపోవడంతో వృద్ధ దంపతులు కంగారు పడ్డారు. గ్రామస్థుల సహాయంతో గ్రామంలో వెతుకగా చెరువు కట్టపై చిన్నారి విగతజీవిగా పడి ఉంది. అది చూసిన గ్రామస్తులు హుటాహుటిన నారాయణపేట రూరల్ పోలీసులకు సమాచారం ఇవ్వడంతో వారు పోలీసు జాగిలాలతో సంఘటన స్థలాన్ని పరీక్షించి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం హైదరాబాద్‌కు తరలించారు.

# వేసవిలో పశుసంరక్షణ మార్గదర్శకాలు పాటించాలి

### వేడి గాలులకు పశువుల్లో ఆరోగ్య సమస్యలు... పశుపోషక శాఖ క్షేత్ర స్థాయి సిబ్బందికి సూచనలు ... పశుసంవర్ధక శాఖ సంచాలకులు దామోదర్ నాయుడు

**విజయవాడ,ఏప్రిల్2(ఆర్ఎన్ఎ):** వేసవికాలంలో సంభవించే ఈదురుగాలులు గ్రీష్మతాపం వడగాలులు వలన పశువుల ఆరోగ్యం క్షీణిస్తుందని ఇది వాటి మరణాలకు దారితీయవచ్చునని పశుసంవర్ధక శాఖ సంచాలకులు టి. దామోదర్ నాయుడు సూచించారు. అప్పుడు పశువులను కాపాడడానికి పశుసంవర్ధక క్షేత్రస్థాయి సిబ్బంది సూచనలు పశు పోషకులు తూచా తప్పకుండా పాటిస్తే పశువుల్లో వృద్ధి రేట్ పెరిగి పశుసమృద్ధి జరుగుతుందని వాటి ఉత్పత్తి సామర్థ్యం సైతం రెట్టింపు అవుతుందని అన్నారు. పశువుల యాజమాన్యం అనేది ఎలా ఉండాలి అనే అంశంపై గురువారం పశుసంవర్ధక క్షేత్ర స్థాయి సిబ్బందికి మరియు పశుపోషకులకు అయన సూచనలు జారీ చేశారు. పశుపోషకులు క్షేత్ర స్థాయి సిబ్బంది అత్యంత జాగ్రత్తగా ఉండాలని ఈ విషయంలో పశుసంవర్ధక క్షేత్ర స్థాయి సిబ్బంది ఎల్లవేళలా జారీ చేసే సూచనలు పాటించి మేలైన పశువుల యాజమాన్యం సాధించాలని ఆయన తెలిపారు. శువులకు పరిశుభ్రమైన నీటి తొ÷–టటెలలో చల్లని తాజా అయిన మంచినీరు ఉదయం తెల్లవారుజామునే అందేవిధంగా జాగ్రత్తలు పాటించి పనిచేయాలని పశుపోషకులకు సూచించారు. ÷ామూహిక నీటి తొ÷–టటెలను ఏర్పాటు చేయాలి. ఈ అంశాన్ని పంచాయతీరాజ్ సిబ్బందికి తెలపాలన్నారు. ఎక్కువగా పశువులు సంచరించే ప్రదేశాలను గుర్తించి అక్కడ నీటి తొ÷–టటెలు ప్రణాళిక ప్రకారం పెట్టాలన్నారు. పశువుల యాజమాన్యంలో పంచాయతీ గ్రామీణ నీటిపారుదల శాఖలు అనుసంధానంతో పని చేయాలన్నారు.నీటి తొట్టెల ఏర్పాటులో స్వచ్ఛంద సేవాసంస్థలు దాతల సహకారం తీసుకుంటే ఎక్కువ మేలు జరుగుతుందని చెప్పారు. శువులకు మేతను చిన్న చిన్న ముక్కలుగా చేసి అందించాలి. ఎండ తక్కువగా ఉన్నప్పుడు మేతను తినిపించు కోవాలి. పశువుల మేత యాజమాన్యం పాటించడం వలన పశువుల్లో జీర్ణశక్తి అభివృద్ధి జరిగి రోగనిరోధకం పశువులు సాధిస్తాయని అప్పుడు ఎక్కువ ఉత్పత్తులు పశువుల ద్వారా పొందవచ్చన్నారు. మేతలో ఖనిజాలు లవణాల మిశ్రమాలు ఎక్కువగా ఉండాలన్నారు. అంటే 30 నుండి 50 గ్రాములు ఉండేలా చూడాలన్నారు. పశువులను ఉదయం సాయంత్రం వేళల్లో మాత్రమే వదలాలన్నారు. పశువులు షెడ్డులకు వచ్చిన తదుపరి చల్లని వాతావరణంలో పరిశుభ్రమైన నీటిని పొందేలా చూడాలన్నారు. పశువుల షెడ్డులు తూర్పు పడమరల దిశగా నిర్మించాలి. గేదెల పాకల పైకప్పు అనేది తరుచూ నీటితో తడుపుతూ పశువులు అధిక ఉష్ణోగ్రతలకు లోను కాకుండా చూడాలి. సంకరజాతి పశువుల షెడ్డులలో తప్పనిసరిగా స్ప్రింకలేర్స్ ఫ్యాన్లు అమర్చుకోవాలి. సూర్యోదయం ముందుగా మరియు సూర్యోదయం తదుపరి మాత్రమే పశువుల నుండి పాల సేకరణ జరపాలి. ఉష్ణోగ్రత అప్పుడు తక్కువగా ఉండడం వలన పశువులు ఎక్కువ ఒత్తిడికి లోనుకాకుండా పాలను ఎక్కువ ఇస్తాయని చెప్పారు. అధిక వేడి నుండి రక్షించుకొనుటకు షెడ్ల చుట్టూ గొనె సంచులను తడిపి అమర్చాలన్నారు. సంచులపై ఆరగా ఆరగా నీటిని చల్లాలన్నారు. పశువుల రవాణా చల్లని వేళల్లో మాత్రమే జరపాలి. పశువులకు ప్రతీ 6 గంటలకు ఒకసారి త్రాగునీరు మేతను తప్పకుండా అందించాలి. పశువులు వేగంగా శ్వాస తీసుకోవడం నోటి నుండి చొంగ వేయడం ఆహారంపై ఆసక్తి కోల్పోవడం నిస్సత్తువుగా కనపడడం నీరు అధికంగా త్రాగడం వంటి లక్షణాలు కనిపిస్తే అధిక ఉష్ణోగ్రత ఒత్తిడి లక్షణాలుగా పరిగణించాలని పశుపోషకులకు అయన సూచించారు. ఇటువంటి లక్షణాలు కనపడిన వెంటనే పశువులను పోషకులు చల్లని నీటితో తడిపి తమ గ్రామం లోని పశువైద్యులను సంప్రదించాలన్నారు. సంచార పశుఆరోగ్య సేవల వాహనాలను అత్యవసర సమయంలో తప్పనిసరిగా వినియోగించుకోవాలని ఆయన సూచించారు. వేసవిలో పశువుల యాజమాన్యంపై తీసుకునే జాగ్రత్తలను తప్పకుండా పశుసంవర్ధక శాఖ క్షేత్ర స్థాయి సిబ్బంది పశుపోషకులకు క్షేత్రస్థాయిలో పర్యటనలు జరిపి ప్రత్యేక పర్యవేక్షణ చేసి తెలపాలని ఈ సందర్భంగా నాయుడు కోరారు.

## కళ్లు అదరుతున్నాయా? నిర్లక్ష్యం చేస్తే ముప్పే

: వైద్య నిపుణుల హెచ్చరిక



**విజయవాడ ఏప్రిల్ 02( నేటి మనదేశమ్ ప్రతినిధి) :** సాధారణంగా కళు అదరడాన్ని చాలామంది ఏదో ఒక శకునంగా భావిస్తుంటారు. అయితే, ఇది కేవలం నమ్మకం మాత్రమే కాదని, తీవ్రమైన ఆరోగ్య సమస్యలకు సంకేతం కావచ్చని వైద్య నిపుణులు హెచ్చరిస్తున్నారు. ప్రధానంగా ఒత్తిడి, ఆందోళన, విపరీతమైన అలసట వల్ల కనురెప్పలు అదిరే అవకాశం ఉంది. అంతేకాకుండా, అతిగా కెఫిన్ (కాఫీ, టీ) లేదా ఆల్కహాల్ తీసుకోవడం, గంటల తరబడి కంప్యూటర్, మొబైల్ స్క్రీన్లను చూడటం వల్ల కంటి కండరాలు బలహీనపడతాయి. పోషకాహార లోపం, కాలుష్యం వల్ల కలిగే అలెర్జీలు, కొన్ని రకాల మందుల దుష్ప్రభావాలు కూడా దీనికి కారణమని వైద్యులు విశ్లేషిస్తున్నారు. ఈ సమస్య వారం రోజుల కంటే ఎక్కువ కాలం వేధిస్తుంటే, ఏమాత్రం ఆలస్యం చేయకుండా వెంటనే కంటి వైద్యుడిని సంప్రదించాలని నిపుణులు సూచిస్తున్నారు.

## గుంటుపల్లిలో పోలీసుల మెరుపు దాడి

: డ్రోన్ల నిఘాతో పేకాట శిబిరం బట్టబయలు



**విజయవాడ ఏప్రిల్ 02( నేటి మనదేశమ్ ప్రతినిధి) :** ఇబ్రహీంపట్నం మండల పరిధిలోని గుంటుపల్లి గ్రామంలో గురువారం పోలీసులు భారీ మెరుపు దాడి నిర్వహించారు. రహస్యంగా సాగుతున్న పేకాట శిబిరాలపై నిఘా ఉంచిన పోలీసులు, ఆధునిక డ్రోన్ టెక్నాలజీని ఉపయోగించి నిందితుల కదలికలను క్షుణ్ణంగా పరిశీలించారు. డ్రోన్ ద్వారా అందిన ఖచ్చితమైన సమాచారంతో, పేకాట ఆడుతున్న వ్యక్తులను రెడ్ హ్యాండెడ్ గా పట్టుకున్నారు. ఈ దాడుల్లో పలువురు వ్యక్తులను అదుపులోకి తీసుకున్నట్లు పోలీసులు వెల్లడించారు. అక్రమ కార్యకలాపాలకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తప్పవని, గ్రామాల్లో అసాంఘిక శక్తుల ఆటకట్టించేందుకు అత్యాధునిక సాంకేతికతతో కట్టుదిట్టమైన నిఘా కొనసాగిస్తామని అధికారులు హెచ్చరించారు.

## ఏప్రిల్ 4వ తేదీన వైఎస్ఆర్ నాయకులకు సన్మాన సభ ఏర్పాటు




**అమలాపురం ఏప్రిల్ 02( నేటి మనదేశమ్ ప్రతినిధి) :** డాక్టర్ బి. ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు చిర్ల జగ్గిరెడ్డి, ఏప్రిల్ 4వ తేదీన రావులపాలెం సి. ఆర్. సి ఫంక్షన్ హాల్లో జడ్పీటిసి సభ్యులు, సర్పంచులు, ఎంపీటీసీలుగా ప్రజల విశ్వాసంతో గెలుపొందిన ప్రజాప్రతినిధులందరికీ అభినందన సన్మాన కార్యక్రమం ఘనంగా ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమానికి చిర్ల జగ్గిరెడ్డి అధ్యక్షత వహిస్తారు.

## జిల్లాలో ప్రశాంతంగా ముగిసిన పదవ తరగతి పరీక్షలు



**కడప ఏప్రిల్ 02( నేటి మనదేశమ్ ప్రతినిధి) :** జిల్లాలో పదవ తరగతి పరీక్షలు గురువారంతో ప్రశాంతంగా ముగిశాయి. రంజాన్ పండుగ కారణంగా వాయిదా పడిన ఇంగ్లీష్ పరీక్ష 167 కేంద్రాల్లో జరిగింది. ఈ పరీక్షకు 27,826 మంది విద్యార్థులు హాజరుకావాల్సి ఉండగా, 27,650 మంది పరీక్ష రాశారు. 176 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు. పరీక్షల నిర్వహణను 44 కేంద్రాల్లో ఫ్లయింగ్ స్క్వాడ్లు, 68 కేంద్రాల్లో సిట్టింగ్ స్క్వాడ్లు పర్యవేక్షించాయి.


## బార్ అధ్యక్షురాలిగా కణితి విజయలక్ష్మి బాధ్యతలు స్వీకరణ



**ఆమదాలవలస ఏప్రిల్ 02( నేటి మనదేశమ్ ప్రతినిధి) :** ఆమదాల వలసలో కణితి విజయలక్ష్మి 4వ సారి బార్ అధ్యక్షురాలిగా గురు వారం బాధ్యతలు స్వీకరించారు. మాజీ అధ్యక్షులు అన్నెపు సత్యం అకౌంట్స్ తో కూడిన బాధ్యతలు అప్పగించి అభినందనలు తెలిపారు. నూతన భవన నిర్మాణమే ధ్యేయంగా పనిచేస్తామని, సభ్యులందరూ కలిసికట్టుగా పనిచేయాలని విజయలక్ష్మి పిలుపునిచ్చారు. ఎమ్మెల్యే కూన రవికుమార్ భవన నిర్మాణానికి హామీ ఇచ్చారని ఆమె తెలిపారు. సభ్యులందరికీ కృతజ్ఞతలు తెలియజేశారు.

# 100 రోజులు.. 100 తరగతి గదులు

## జూన్ 13 నాటికి పాఠశాలల పనులు పూర్తి చేయాలి: జిల్లా కలెక్టర్ కృతికా శుక్లా



**పల్నాడు ఏప్రిల్ 02( నేటి మనదేశమ్ ప్రతినిధి) :** పల్నాడు జిల్లాలో "మనబడి మన భవిష్యత్" కార్యక్రమంలో భాగంగా చేపట్టిన పాఠశాలల నిర్మాణ పనులను యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ కృతికా శుక్లా అధికారులను ఆదేశించారు. గురువారం కలెక్టర్ క్యాంపు కార్యాలయం లో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా విద్యా శాఖ అధికారి, ఎం.ఈ.ఓ లతో, ఇంజనీరింగ్ శాఖ అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, జిల్లాలో తక్కువ మరమ్మతులు అవసరం ఉండి, త్వరగా అందుబాటులోకి వచ్చే తరగతి గదులు మరియు టాయిలెట్లపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. ఈ కార్యక్రమానికి "100 రోజులు -- 100 తరగతి గదులు" గా నామకరణం చేస్తూ జూన్ 13న పాఠశాలలు పునఃప్రారంభమయ్యే నాటికి పనులు పూర్తి చేయాలని ఆదేశించారు. ఇప్పటికే 80 శాతం పనులు పూర్తయిన తరగతి గదులు,మరుగు దొడ్లకు మొదటిప్రాధాన్యత ఇవ్వాలన్నారు. విద్యార్థుల సంఖ్య ఎక్కువ గా ఉన్నచోట మరియు అత్యవసరం గా మరమ్మతులు అవసరమైన జిల్లా పరిషత్ హైస్కూళ్ల పనులను వెంటనే పూర్తి చేయాలన్నారు. ఇంజనీరింగ్ అధికారులు క్షేత్రస్థాయిలో పనులను నిరంతరం పర్యవేక్షిం చాలని కలెక్టర్ స్పష్టం చేశారు. ఈ సమీక్షా సమావేశంలో జిల్లా విద్యాశాఖ అధికారి పి.వి.జె. రామారావు, వివిధ శాఖల ఇంజనీరింగ్ అధికారులు మరియు ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

## సీసీ రహదారులను ప్రారంభించిన మంత్రి డోలా



**టంగుటూరు ఏప్రిల్ 02( నేటి మనదేశమ్ ప్రతినిధి) :** ప్రకాశం జిల్లా టంగుటూరు మండలం శివపురం గ్రామంలో 15వ ఆర్థిక సంఘం, ఉపాధి హామీ పథకం నిధులు రూ.25 లక్షలతో చేపట్టిన సీసీ రోడ్లు, డ్రైనేజీలను గురువారం సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డోలా బాలవీరాంజనేయ స్వామి పలువురు అధికారులతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి స్వామి మాట్లాడుతూ రానున్న రెండేళ్లలో గ్రామంలోని ప్రతి వీధిలో సీసీ రోడ్డు, డ్రైనేజీలను పూర్తి చేస్తామన్నారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం కల్పిస్తూ, ఒకటో తేదీన పింఛన్లను పంపిణీ చేస్తున్నానమన్నారు. సూపర్ సిక్స్ పథకంలోని ప్రతి హామీని నెరవేరుస్తూ రాష్ట్రాన్ని అభివృద్ధి చేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో డ్వామా పీడీ జోసెఫ్ కుమార్, ఏఎంసీ ఛైర్మన్ రాచగర్ల వెంకట్రావు, తెలుగుదేశం పార్టీ నాయకులు బెల్లం జయంతి బాబు, బెజవాడ వెంకటేశ్వర్లు, తహసీల్దార్ ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

## రాజమండ్రిలో ట్రాఫిక్ తనిఖీలు: నిబంధనల ఉల్లంఘనపై చర్యలు



**రాజమండ్రి ఏప్రిల్ 02( నేటి మనదేశమ్ ప్రతినిధి)** :రాజమండ్రి నగరంలో ట్రాఫిక్ నియంత్రణలో భాగంగా పలుచోట్ల గురువారం వాహన తనిఖీలు నిర్వహించారు. ట్రాఫిక్ ఎస్ఐ సత్యనారాయణ ఆధ్వర్యంలో జరిగిన ఈ తనిఖీలలో ద్విచక్ర వాహనాలపై ప్రత్యేకంగా దృష్టి సారించారు. వాహనదారుల వద్ద డ్రైవింగ్ లైసెన్స్, ఆర్సీ బుక్, ఇన్సూరెన్స్ వంటి పత్రాలను పరిశీలించారు. పెండింగ్‌లో ఉన్న చలానాల వివరాలను కూడా తనిఖీ చేసి, వెంటనే చెల్లించాలని సూచించారు. నిబంధనలు ఉల్లంఘించిన వారిపై చర్యలు తీసుకున్నారు. ట్రాఫిక్ నియమాలను పాటించడం ద్వారా ప్రమాదాలను తగ్గించవచ్చని అధికారులు తెలిపారు. వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించడం, పత్రాలు సక్రమంగా ఉంచుకోవడం వంటి అంశాల్లో జాగ్రత్తలు పాటించాలని సూచించారు.

## రైతు సంక్షేమమే కేడీసీసీ బ్యాంకు లక్ష్యం

### కృష్ణా డిస్ట్రిక్ట్ కోఆపరేటివ్ సెంట్రల్ బ్యాంక్ చైర్మన్



**మచిలీపట్నం ఏప్రిల్ 02( నేటి మనదేశమ్ ప్రతినిధి) :** కృష్ణా డిస్ట్రిక్ట్ కోఆపరేటివ్ సెంట్రల్ బ్యాంక్ లిమిటెడ్ లాభాల బాటలో పయనిస్తూ రాష్ట్రంలో అగ్రస్థానంలో నిలిచిందని కేడీసీసీ బ్యాంక్ చైర్మన్ నెట్టెం శ్రీ రఘురాం అన్నారు. గురువారం కేడీసీసీ బ్యాంకు కాన్ఫరెన్స్ హాల్లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ రైతు, సన్న కారు రైతుల సంక్షేమమే తమ బ్యాంకు లక్ష్యం అన్నారు. 2025-26 సంవత్సరం బ్యాంకు అభివృద్ధిపై ఏర్పాటుచేసిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడుతూ తాను బ్యాంకు చైర్మన్ గా కేడీసీసీ బ్యాంకుకు వచ్చి సంవత్సరం అవుతున్నట్లుగా తెలియజేశారు. బ్యాంకు సీఈఓ సిబ్బంది బ్యాంకు అభివృద్ధిలో తనకు అందిస్తున్న సహకారానికి ధన్యవాదాలు తెలిపారు. బ్యాంకు షేర్ క్యాపిటల్ 453.94 కోట్లు, రిజర్వ్ ఫండ్ 443.95 కోట్లతో 2025-26 సంవత్సరం సొంత నిధులు మొత్తం 897.88 కోట్ల అభివృద్ధికి చేరాయని అన్నారు. అభివృద్ధి బాటలో కేడీసీసీ బ్యాంకు పని చేయడం పట్ల ఆనందం వ్యక్తం చేశారు. రాష్ట్రస్థాయిలో తాము ప్రథమ స్థానంలో నిలిచామని సగర్వంగా తెలిపారు. సొంత నిధుల గ్రోత్ గతంలో కన్నా 12.2% కి వృద్ధి చెందిందన్నారు. మొత్తం బ్యాంకు డిపాజిట్స్ 3,850.76 కోట్లు, లోన్లు అడ్వాన్సులు 8618.63 కోట్లు తో మొత్తం బ్యాంకు వ్యాపారం 12,469.39 కోట్లకు చేరిందన్నారు. గతంలో కన్నా 7.17% వృద్ధి నమోదు తో బ్యాంకు ముందంజలో ఉండటం గర్వకారణంగా ఉందన్నారు. బారోయింగ్స్ 6646.38 కోట్లతో గతంలో కన్నా 1.54 శాతం అభివృద్ధి వైపు పయనిస్తోంద న్నారు. ఇన్వెస్ట్మెంట్లు 200863.13 కోట్లకు చేరిందని, 13. 36% అభివృద్ధిలో సాగుతోందన్నారు. తీసుకున్న వడ్డీలు 948.17 కోట్లకు చేరి 4.76% వృద్ధిలో పయనిస్తోందన్నారు. మిస్లీనియస్ ఇన్కమ్ 19.48 కోట్లు గా ఉందన్నారు. బ్యాంక్ ఎస్టాబ్లిష్మెంట్ ఎక్స్పెండిచర్ 91.26 కోట్లు ఖర్చయింది అన్నారు. బ్యాంక్ ఆపరేటింగ్ ఎక్స్పెండిచర్ 52.78 కోట్లు, ప్రాఫిట్ బిఫోర్ టాక్స్ 105.99 కోట్లకు చేరి, 4.88% వృద్ధిరేటు నమోదు చేసుకుందన్నారు. ఉమ్మడి కృష్ణాజిల్లాలో చాట్రాయి, తోట్లవల్లూరు, కాటూరు బ్యాంకు శాఖలలో 100% వసూళ్లు సాధించడం పట్ల సిబ్బందిని అభినందించారు. రైతులు తీసుకున్న రుణాలను సకాలంలో చెల్లించి తిరిగి వారం రోజుల్లో మళ్ళీ వెంటనే పొందవచ్చన్నారు. రైతులు పంట రుణమాఫీ కింద జూన్ 30 లోపు క్లైమ్ పెట్టుకోవాలని అన్నారు. రైతు సంక్షేమమే తమ బ్యాంకు లక్ష్యమని, సన్న చిన్న కారు రైతులకు చిరు వ్యాపారులకు తమ బ్యాంకు ఎల్లవేళలా అండదండల అందిస్తుందని చైర్మన్ నెట్టెం శ్రీ రఘురాం అన్నారు. చనిపోయిన రైతులకు డెత్ లైన్లు సకాలంలో అందిస్తామన్నారు. అయితే సంక్షేమాన్ని దృష్టిలో పెట్టుకొని వారికి జీవిత బీమా కూడా అమలు చేస్తాం అనే తెలిపారు. చిన్న సన్నకారు రైతులు ఎవరైనా అనారోగ్య కారణాల వల్ల గాని మరే ఇతర కారణాల వల్ల గాని, వృద్ధాప్యం వల్ల గాని మరణిస్తే వారి కుటుంబానికి మట్టి ఖర్చులు నిమిత్తం పదివేల రూపాయలు దహన సంస్కారాల ఖర్చులను కూడా అందజేస్తామన్నారు. రైతులు తమ ఇన్సూరెన్స్ పాలసీని ఎప్పటికప్పుడు రెన్యువల్ చేసుకోవాలని తెలిపారు. ఈ సందర్భంగా బ్యాంకు సంక్షేమం, అభివృద్ధి కి చిత్తశుద్ధితో పాటుపడిన ఉద్యోగులందరికీ పేరుపేరునా ధన్యవాదాలు తెలిపారు. తమ హయాంలో కేడీసీసీ బ్యాంకును లాభాల బాటలో పయనింప చేస్తామని, అన్నారు. డిపాజిట్ల సేకరణలో కూడా బ్యాంకు అగ్రభాగాన నిలవడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో కేడీసీసీ బ్యాంకు సీఈవో శ్యామ్ మనోహర్ తదితరులు పాల్గొన్నారు.

## అమరావతికి చట్టబద్ధత: వైవీయూలో సంబరాలు




**కమలాపురం ఏప్రిల్ 02( నేటి మనదేశమ్ ప్రతినిధి) :** అమరావతిని ఆంధ్రప్రదేశ్ శాశ్వత రాజధానిగా గుర్తిస్తూ పార్లమెంటు చట్టబద్ధత కల్పించడంతో వైవీయూ బిజినెస్ మేనేజ్‌మెంట్ విభాగంలో విద్యార్థులు, అధ్యాపకులు గురువారం స్వీట్లు పంచుకుని ఆనందం వ్యక్తం చేశారు. హెచ్‌వోడీ డా. పి. సరిత ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో, ఈ నిర్ణయం రాష్ట్రంలో పారిశ్రామిక వృద్ధి, ఉపాధి అవకాశాలను పెంచుతుందని అభిప్రాయపడ్డారు. సాయంత్రం క్యాంపస్‌లో దీపాలు వెలిగించి అమరజ్యోతి నిర్వహించనున్నారు.

## అన్న క్యాంటీన్‌ను పరిశీలించిన పుర కమిషనర్



**ఆదోని ఏప్రిల్ 02( నేటి మనదేశమ్ ప్రతినిధి) :** ఆదోని పట్టణంలోని అంబేద్కర్ కూడలిలో ఉన్న అన్న క్యాంటీన్‌ను గురువారం ఉదయం పురపాలక సంఘం కమిషనర్ నయీం మహమ్మద్ పరిశీలించారు. అల్పాహారం గురించి అడిగి తెలుసుకున్నారు. క్యాంటీన్‌కు వచ్చిన వారితో మాట్లాడారు. క్యాంటీన్‌లో సమస్యలు సృష్టించిన, సిబ్బంది ప్రవర్తన తీరు ఇబ్బందికరంగా ఉంటే క్యాంటీన్‌లో క్యూఆర్ కోడ్ స్కానర్ ద్వారా నేరుగా ఫిర్యాదు చేయవచ్చని కమిషనర్ తెలిపారు. పరిశుభ్రతను పాటించి, శుద్ధి నీటిని అందించాలని సిబ్బందిని కోరారు.

## ప్రజా సేవల్లో నాణ్యతే లక్ష్యం: జిల్లా కలెక్టర్




**రాజమండ్రి ఏప్రిల్ 02( నేటి మనదేశమ్ ప్రతినిధి) :** రాజమండ్రిలోని జిల్లా కలెక్టరేట్‌లో తూ. గో జిల్లా కలెక్టర్ కీర్తి చేకూరి జిల్లా అధికారులతో పాజిటివ్ పబ్లిక్ పర్సెప్షన్, కీ పెర్ఫార్మెన్స్ ఇండికేటర్స్ పై సమీక్ష నిర్వహించారు. ప్రజలకు అందుతున్న ప్రభుత్వ సేవల నాణ్యతను పెంచడం ద్వారానే సానుకూల ప్రజాభిప్రాయం సాధ్యమవుతుందని, సేవల విషయంలో అలసత్వం సహించబోమని కలెక్టర్ స్పష్టం చేశారు. ఈ సమీక్షలో ప్రభుత్వ సేవల మెరుగుదలపై దృష్టి సారించారు.

## కేజీఆర్ఎల్ పూర్వ విద్యార్థినికి పీహెచ్‌డీ పట్టా



**భీమవరం ఏప్రిల్ 02( నేటి మనదేశమ్ ప్రతినిధి) :** కేజీఆర్ఎల్ కాలేజ్ ఆఫ్ ఫార్మసీ పూర్వ విద్యార్థిని, అధ్యాపకురాలు మరపట్ల షైనీ ఆంధ్ర విశ్వవిద్యాలయం ఫార్మాస్యూటికల్ సైన్సెస్ విభాగంలో డాక్టరేట్ (పీహెచ్‌డీ) పట్టా పొందారు. 'కొత్త ఐసాటిన్ లింక్డ్ చల్కోన్లు వాటి పైరజోల్ ఉత్పన్నాల సంశ్లేషణ, లక్షణ నిర్ధారణ, జీవక్రియల మూల్యాంకనం మాలిక్యులర్ డాకింగ్ అధ్యయనాలు' అనే అంశంపై ప్రొఫెసర్ వి గిరిజా శాస్త్రి పర్యవేక్షణలో ఆమె పరిశోధన చేశారు. ఆంధ్ర విశ్వవిద్యాలయం వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ రాజశేఖర్ చేత ఈ పట్టాను గురువారం అందుకున్నారు. ఈ విషయాన్ని కేజీఆర్ఎల్ ఫార్మసీ కళాశాల డైరెక్టర్ డా. కవల నాగేశ్వరరావు, ప్రిన్సిపాల్ డా. డి. రాఘవ తెలిపారు.

## రికార్డు స్థాయిలో పన్ను వసూళ్లు



జిల్లా ప్రత్యేక అధికారి చొరవతో ఊహించని రీతిలో పురోగతి.

నగరపాలక సంస్థ కమిషనర్ బాపిరాజు.



**మచిలీపట్నంఏప్రిల్ 02( నేటి మనదేశమ్ ప్రతినిధి)** మచిలీపట్నం నగరపాలక సంస్థ మునుపెన్నడూ లేని విధంగా రికార్డు స్థాయిలో పన్నువసూలు చేసి చరిత్ర కెక్కిందని, నగరపాలక సంస్థ ప్రత్యేక అధికారి జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ తీసుకున్న చొరవ వల్ల ఈ ఘనత సాధించామని నగరపాలక సంస్థ కమిషనర్ బాపిరాజు తెలియజేశారు. 2025 -26 మార్చి 31వ తేదీ నాటికి మునుపెన్నడూ లేని విధంగా 1,30,00,000/- రూపాయలు పన్ను వసూలు చేసి నగరపాలక సంస్థ చరిత్ర సృష్టించిందని కమిషనర్ బాపిరాజు తెలిపారు. జిల్లా ప్రత్యేక అధికారి, జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ నగరపాలక సంస్థ అభివృద్ధిలో భాగంగా పన్ను వసూళ్లపై ప్రత్యేక దృష్టి పెట్టడం వల్ల ఈ ఘనత సాధించాం అన్నారు. జిల్లా కలెక్టర్ సూచనల ప్రకారం తాను అసిస్టెంట్ కమిషనర్ గోపాలరావు రెవెన్యూ అధికారి వెంకటేష్ కార్యాలయ సిబ్బంది ప్రత్యేక బృందాలుగా ఏర్పడి బకాయిదారుల నుండి సామరస్యంగా పన్ను వసూలు చేశా మన్నారు. నగర ప్రజల ప్రయోజనార్థం 365 రోజులు పన్ను వసూలు కేంద్రాలు ఉదయం 6 గంటల నుండి రాత్రి 8 గంటల వరకు నిరంతరాయంగా తెరిచి ఉంచడం జరిగిందన్నారు. దీని ఫలితమే పన్ను వసూళ్లలో రికార్డు స్థాయిలో పురోగతి సాధించిందన్నారు. 2026- 27 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి డిమాండ్ నోటీసులు జనరేట్ చేయడంలో భాగంగా ఏప్రిల్ 1వ తేదీ నుండి 5వ తేదీ వరకు సర్వీసులు నిలిపి ఉంచడం జరుగుతుందని, ఆరవ తేదీ నుండి పన్ను వసూలు కేంద్రాలు యధావిధిగా తెరిచి ఉంటాయని బాపిరాజు తెలిపారు

# వారణాసి ఇప్పుడెందుకు గుర్తుకు వస్తోంది

రామాయణ పార్ట్ 1 టీజర్ వచ్చాక సోషల్ మీడియాలో పెద్ద చర్చ జరుగుతోంది. ముంబైలో దీని స్పెషల్ ప్రీమియర్ చూసిన మీడియా ప్రతినిధులు ఓ రేంజ్ లో ఎలివేషన్లు ఇచ్చాక అంచనాలు పెరిగిపోయాయి.

వాటిని దృష్టిలో పెట్టుకుని చూసిన చాలా మంది నాలుగు వేల కోట్ల స్థాయిలో బొమ్మ కనిపించలేదని పెదవి విరుస్తున్న వైనం ఎక్స్, ఇన్స్ టాలో గమనించవచ్చు. కొన్ని విజువల్స్ ఎక్స్ ట్రాడినరిగా ఉంటే మరికొన్ని టీవీ సీరియల్ తరహాలో ఉన్నాయనే కామెంట్స్ వినిపించాయి. ఫైనల్ అవుట్ పుట్ ఇలాగే ఉంటుందని చెప్పలేం కానీ రిలీజ్ నాటికీ క్వాలిటీలో ఖచ్చితంగా మార్పు ఉంటుంది. ఇదిలా ఉండగా ఈ సందర్భాన్ని పురస్కరించుకుని మహేష్ బాబు వారణాసి ప్రస్తావన తెస్తున్నారు కొందరు నెటిజెన్లు. గత ఏడాది హైదరాబాద్ లో లాంచ్ చేసిన టైటిల్ కాన్సెప్ట్ వీడియోని మళ్ళీ షేర్ చేస్తున్నారు. కథలో ఉద్దేశాన్ని, రాజమౌళి ప్రెజెంట్ చేసిన తీరుని ఉదహరిస్తూ జక్కన్నకు సాటివచ్చే వాళ్ళు ఎవరూ లేరంటూ కితాబుల వర్షం కురిపిస్తున్నారు. ఇక్కడ పోలిక సబబని చెప్పలేం కానీ రామాయణ టీమ్ గుర్తుపెట్టుకోవాల్సిన విషయాలు కొన్ని ఉన్నాయి. రామాయణ రెగ్యులర్ మూవీ కాదు. భారతీయులకు ఒక ఎమోషన్. రాముడి కథను కొన్ని వందల వేలసార్లు చూసినా మళ్ళీ చూసేందుకు సిద్ధంగా ఉంటారు. అలాంటప్పుడు ఇంత పెద్ద క్యాస్టింగ్ ఉన్న గ్రాండియర్ నుంచి విపరీతంగా ఎక్స్ పెక్ట్ చేయడం సహజం. వావ్ అనిపించాల్సిందే. జస్ట్ బాగుందనే మాట సరిపోదు. దానికోసం ఎంత కష్టమైనా పడాల్సిందే. ప్రపంచవ్యాప్తంగా కొన్ని వేలమంది ఈ ప్రాజెక్టు మీద పని చేస్తున్నారు. భవిష్యత్తులో ప్రతి ఒక్కరికి ల్యాండ్ మూవీగా నిలిచిపోవాలని నిర్మాత నమిత్ మల్హోత్రా కంకణం కట్టుకున్నారు. అయితే ఏఐ టెక్నాలజీ పెరిగిపోతున్న తరుణంలో డిఎన్ఈజి సంస్థ నుంచి జనాలు బెస్ట్ ఆశిస్తున్నారు. ఆ మోతాదు ఏ మాత్రం తగ్గినా ఒప్పుకునే పరిస్థితి లేదు. రెహమాన్, జిమ్మర్ బ్యాక్ గ్రౌండ్ స్కోర్ బాగున్నప్పటికీ ఇంకా హై ఉండాలని మ్యూజిక్ లవర్స్ కోరుతున్నారు. రామాయణ డిస్కషన్ ఇంకెక్కడి దాకా వెళ్తుందో చూడాలి.

# శుభసూచకం... ప్రిమియర్లు ఫుల్




వేసవి సీజన్లో కొంచెం ముందుగానే రేసులోకి దిగింది 'ఉస్తాద్ భగత్ సింగ్'. కానీ ఈ చిత్రం టాలీవుడ్‌కు శుభారంభాన్ని అందించలేకపోయింది. ఆరంభ మెరుపుల తర్వాత ఆ సినిమా చల్లబడిపోయింది. తర్వాతి వారం వచ్చిన సినిమాలు ఏమాత్రం ప్రభావం చూపలేకపోయాయి. కానీ ఈ వారం రాబోయే రెండు సినిమాలు మాత్రం ప్రేక్షకుల్లో బాగానే ఆసక్తి రేకెత్తిస్తున్నాయి. శర్వానంద్ మోటార్ స్పోర్ట్స్ మూవీ 'బైకర్'తో పాటు.. సంగీత్ శోభన్ హీరోగా నటించిన ఫాంటసీ ఎంటర్టైనర్ 'రాకాస' ఈ శుక్రవారం బాక్సాఫీస్ బరిలో నిలిచాయి ఈ రెండు చిత్రాల మీద ఎంతో నమ్మకంగా ఉన్న మేకర్స్ ఒక రోజు ముందే పెయిడ్ ప్రిమియర్స్ ప్లాన్ చేశారు. హైదరాబాద్‌లో ఈ రెండు చిత్రాలకు రెండంకెల సంఖ్యలో షోలు పడుతున్నాయి. ముందు రెండు చిత్రాలకూ పరిమిత థియేటర్లలో కొన్ని షోలు వేయాలి అనుకున్నారు. కానీ బుకింగ్స్ ఓపెన్ అయ్యాక ఆ షోలకు వచ్చిన రెస్పాన్స్ చూశాక.. షోలు పెరుగుతూ వెళ్లాయి. 'బైకర్' మూవీకి ముందు ప్రిమియర్ మల్టీప్లెక్స్ థియేటర్లలో మాత్రమే షోలు మొదలుపెట్టి.. ఆ తర్వాత వేరే మల్టీప్లెక్సులు, సింగిల్ స్క్రీన్లలో కూడా షోలు ఓపెన్ చేశారు. ఈ చిత్రానికి 30కి పైగానే ప్రిమియర్ షోలు పడుతున్నాయి హైదరాబాద్‌లో. మెజారిటీ షోలు సోల్డ్ ఔట్ దిశగా వెళ్తున్నాయి. ఇక 'బైకర్'తో పోలిస్తే 'రాకాస' చిన్న సినిమా అయినా.. దానికి కూడా పెద్ద సంఖ్యలోనే ప్రిమియర్లు పడుతున్నాయి. ఒక్కో మల్టీప్లెక్సులో రెండు మూడు షోలు వేస్తున్నారు. కొన్ని సింగిల్ స్క్రీన్లలో కూడా షోలు పడుతున్నాయి. దానికీ హైదరాబాద్‌లో షోల సంఖ్య 30 దాటిపోయింది. చాలా షోలు ఫుల్ అయ్యే పరిస్థితి కనిపిస్తోంది. ఈ రెండు చిత్రాలకూ ఏపీలో వైజాగ్, విజయవాడల్లోనూ ప్రిమియర్స్ వేస్తున్నారు. వాటికీ రెస్పాన్స్ బాగుంది. మొత్తానికి ప్రిమియర్స్ బుకింగ్స్ చూస్తుంటే ఎంతో ఆశాజనకంగా ఉంది. రెండూ బలమైన కంటెంట్ ఉన్న సినిమాల్లానే కనిపిస్తున్నాయి. ప్రిమియర్స్ నుంచి పాజిటివ్ టాక్ వస్తే.. శుక్రవారం రెండు చిత్రాలకూ మంచి ఓపెనింగ్స్ ఆశించవచ్చు. వీకెండ్లో థియేటర్లు కళకళలాడొచ్చు.




## విస్మయపరిచే 'రామ' పరిచయం



బాలీవుడ్ లోనే కాదు భారతీయ సినీ చరిత్రలోనే అత్యంత ఖరీదయిన సినిమాగా తెరకెక్కుతున్న రామాయణ పార్ట్ 1 టీజర్ ఇవాళ హనుమాన్ జయంతి సందర్భంగా రాముడి పాత్ర పరిచయంతో విడుదల చేశారు. కథగా చెప్పేందుకు కొత్త విషయం లేదు కానీ విజువల్స్ తోనే తమ విజన్ ఏ స్థాయిలో ఉందో చూపెట్టేందుకు ప్రయత్నించారు దర్శకులు నితేష్ తివారి, నిర్మాత నమిత్ మల్హోత్రా. కేవలం రాముడిని చూపించే కాన్సెప్ట్ కాబట్టి ఇతర ఆర్టిస్టులను రివీల్ చేయలేదు. ప్రపంచంలోనే అత్యున్నత విఎఫ్ఎక్స్ కంపెనీల్లో ఒకటైన డిఎన్ఈజి ఈ రామాయణలో భాగస్వామ్యం వహిస్తున్న సంగతి తెలిసిందే. 8 ఆస్కార్ అవార్డులు దక్కించుకున్న ఈ సంస్థ ఎప్పుడూ చూడని గ్రాఫిక్స్ ని ఈ ఎపిక్ డ్రామాలో చూపించబోతున్నట్టు ఇన్ సైడ్ టాక్. ఇక వీడియో విషయానికి వస్తే ఏఆర్ రెహమాన్, జిమ్స్ హ్యామర్ నేపథ్య సంగీతంలో ప్రతి క్షణం ఎలివేట్ అయ్యే స్థాయిలో అబ్బురపరిచే దృశ్యాలు రెండు నిమిషాల ముప్పై ఎనిమిది సెకండ్లు కట్టిపడేస్తాయి. నాలుగు వేల కోట్ల బడ్జెట్ అంటున్నారు కాబట్టి ఆ స్థాయిలో అనిపించాయా అంటే వెంటనే సమాధానం చెప్పడం కష్టం. ఎందుకంటే ఇది కేవలం శాంపిల్ మాత్రమే. రుచి చెప్పడానికి ఒక్క మెతుకు సరిపోతుంది కానీ ఇలాంటి కంటెంట్ విషయంలో తొందరపడి ఎలాంటి జడ్జ్ మెంట్లు ఇవ్వలేం. పైగా రిలీజ్ ఇంకా చాలా దూరం ఉంది కాబట్టి పరిమితంగా సీన్స్ చూపించాలన్న ఉద్దేశంతో కట్ చేసిన విధానం ఎన్నో విషయాలను దాచి పెట్టిందన్నది వాస్తవం. డేట్ ఇంకా నిర్ధారణగా చెప్పకపోయినా ఇదే సంవత్సరం దీపావళికి విడుదల కావడం పక్కా. మరోసారి దాన్ని టీజర్ లో నొక్కి చెప్పారు. సాయిపల్లవి సీతగా, యాష్ రావణుడిగా, సన్నీ డియోల్ హనుమంతుడిగా నటిస్తున్న రామాయణ ఇకపై ఎవరూ ఇంత గొప్పగా రామకథను చెప్పలేరన్న రీతిలో నితేశ్ తివారి తెరకెక్కిస్తున్నట్టు ఇన్ సైడ్ టాక్. ఈ స్థాయి అంచనాలను నిలబెట్టుకోగలిగితే వరల్డ్ వైడ్ వసూళ్లతో పెట్టిన పెట్టుబడి రికవరీ చేసుకోవచ్చు. అదే జరిగితే కొత్త చరిత్రకు శ్రీకారం చుట్టినట్టే.



# బిజినెస్ న్యూస్



## మైనస్ 1526 పాయింట్ల నుంచి 185 -లోకి సెన్సెక్స్



దేశీయ స్టాక్ మార్కెట్ సూచీలు లాభాల్లో ముగిశాయి. ఉదయం భారీ నష్టాల్లో ట్రేడైన సూచీలు.. ఆఖర్లో కోలుకుని లాభాల్లో ముగిశాయి. డాలరుతో పోలిస్తే రూపాయి మారకం విలువ బలోపేతం కావడం, అన్ని రంగాల్లో ఎంపిక చేసిన స్టాక్స్‌లో కొనుగోళ్ల మద్దతు కారణంగా సూచీలు రాణించాయి. ఇంట్రాడేలో 1526 పాయింట్ల నష్టం నుంచి సెన్సెక్స్ కోలుకోవడం గమనార్హం. సెన్సెక్స్ ఉదయం 72,262.05 పాయింట్ల (క్రితం ముగింపు 73,134.32) వద్ద భారీ నష్టాల్లో ప్రారంభమైంది. ఇంట్రాడేలో 71,545.81 వద్ద కనిష్ఠాన్ని తాకింది. మధ్యాహ్నం తర్వాత క్రమంగా కోలుకున్న సూచీ.. చివరకి 185.23 పాయింట్ల లాభంతో 73,319 వద్ద ముగిసింది. నిఫ్టీ 33.70 పాయింట్ల లాభంతో 22,713 పాయింట్ల వద్ద స్థిరపడింది. డాలరుతో రూపాయి మారకం విలువ 157 పైసలు కోలుకుని 93.13గా ఉంది. సెన్సెక్స్ 30 సూచీలో హెచ్‌సీఎల్ టెక్నాలజీస్, టెక్ మహీంద్రా, ఇన్ఫోసిస్, టీసీఎస్, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ స్టాక్స్ లాభాల్లో ముగిశాయి. ఏషియన్ పెయింట్స్, ఎటర్నల్, సన్‌ఫార్మా, ఎన్టీపీసీ, రిలయన్స్ ఇండస్ట్రీస్ స్టాక్స్ నష్టాలు చవిచూశాయి. అంతర్జాతీయ విపణిలో బ్రెంట్ క్రూడ్ బ్యారెల్ ధర 108 డాలర్లు, బంగారం ఔన్సు 4616 డాలర్ల వద్ద కొనసాగుతోంది.

## లక్ష్యం దాటిన పరోక్ష పన్ను వసూళ్లు.. ఆ ఒక్కటీ మిస్




దేశంలో పరోక్ష పన్ను వసూళ్లు లక్ష్యాన్ని దాటాయి. 2025-26 ఆర్థిక సంవత్సరానికి ప్రభుత్వం రూ.15.52 లక్షల కోట్ల మేర పరోక్ష పన్నుల వసూళ్లను లక్ష్యంగా పెట్టుకోగా.. వాస్తవ వసూళ్లు ఆ అంచనాలను మించాయని ప్రభుత్వవర్గాలు గురువారం వెల్లడించాయి. కస్టమ్స్, ఎక్సైజ్, జీఎస్టీ కలిపి సవరించిన అంచనాలు రూ.15.52 లక్షల కోట్లు దాటినట్లు పేర్కొన్నాయి. వాస్తవంగా ఎంత మొత్తం వచ్చిందనే వివరాలు వెల్లడించకుండా.. ఏ పన్ను రూపంలో ఎంత శాతం పన్ను వసూలైందనే వివరాలను అధికారులు వెల్లడించారు. కస్టమ్స్ డ్యూటీ అంచనాలతో పోలిస్తే 102 శాతం వసూలైందని, ఎక్సైజ్ డ్యూటీ 101 శాతం, సీజీఎస్టీ 100.8% వసూలైందని అధికార వర్గాలు వెల్లడించాయి. మొత్తంగా జీఎస్టీ, ఇతర పన్నులు కలిపి పరోక్ష పన్ను వసూళ్లు 101.2 శాతంగా ఉన్నట్లు తెలిపాయి. మిగిలిన అన్ని పన్నులూ లక్ష్యాన్ని చేరుకున్నప్పటికీ.. ఒక్క పాన్ మసాలాపై విధించిన హెల్త్, నేషనల్ సెక్యూరిటీ సెస్సు మాత్రం అంచనాలను అందుకోలేకపోయింది. 40 శాతం జీఎస్టీ రేటుకు అదనంగా ఈ ఏడాది ఫిబ్రవరి 1 నుంచి ఈ ప్రత్యేక సెస్సును కేంద్రం వసూలు చేస్తోంది. ఈ సెస్సు రూపంలో రూ.2,330 కోట్లు వస్తాయని ప్రభుత్వం భావించగా.. కేవలం 63 శాతం మాత్రమే లక్ష్యాన్ని చేరుకుంది. కొత్తగా ప్రవేశపెట్టిన పన్ను కావడం వల్ల ఈ తగ్గుదల ఉందని అధికారులు భావిస్తున్నారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి ఈ సెస్సు రూపంలో రూ.14 వేల కోట్లు రాబట్టాలని కేంద్ర ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది.

## రోడ్‌స్టర్ ధరను రూ.60 వేలు తగ్గించిన ఓలా ఎలక్ట్రిక్



ప్రముఖ విద్యుత్ ద్విచక్ర వాహనాల తయారీ సంస్థ ఓలా ఎలక్ట్రిక్ తన ప్రీమియం మోటార్ సైకిల్ రోడ్‌స్టర్ ఎక్స్ 9.1 ధరను భారీగా తగ్గించింది. 4680 భారత్‌సెల్‌పై రూపొందిన ఈ బైక్ ధరను ఏకంగా రూ.60 వేలు తగ్గిస్తున్నట్లు కంపెనీ ప్రకటించింది. ప్రస్తుతం దీని ధర రూ.1,89,999 ఉండగా.. రూ.1,29,999కు తగ్గిస్తున్నట్లు వెల్లడించింది. ఓలా తన గిగా ఫ్యాక్టరీలో పూర్తి స్వదేశీ పరిజ్ఞానంతో రూపొందించిన బ్యాటరీ సెల్ (4680 భారత్ సెల్‌ను) ఈ మోటార్ సైకిల్‌లో వినియోగించింది. ఈ సెల్ తయారీ వేగవంతం చేసిన నేపథ్యంలో దీని ధరలు తగ్గుముఖం పట్టాయని తెలిపింది. ఈ ప్రయోజనాన్ని వినియోగదారులకు బదిలీ చేయడంలో భాగంగా రోడ్‌స్టర్ మోటార్ సైకిల్ ధరను భారీగా తగ్గిస్తున్నట్లు వెల్లడించింది. అయితే, ఈ మోటార్ సైకిల్‌ను లిమిటెడ్ టైమ్ విండోలో మాత్రమే కొనుగోలుకు అనుమతిస్తారు. ఏప్రిల్ 3న సాయంత్రం 6 గంటల నుంచి 9 గంటల వరకు కొనుగోలు విండోను తెరవనున్నట్లు ఓలా ప్రతినిధి తెలిపారు. రోడ్‌స్టర్ అందుబాటును బట్టి ఎప్పటికప్పుడు పర్చేజ్ విండో సమయాలను వెల్లడిస్తామని పేర్కొంది. ఓలా ఎలక్ట్రిక్ రోడ్‌స్టర్ 9.1 ఒకసారి ఛార్జింగ్ చేస్తే 500 కిలోమీటర్లు వరకు ప్రయాణించొచ్చని కంపెనీ చెబుతోంది. ప్రస్తుత #EndICEAge క్యాంపెయిన్‌లో ఈ బైక్‌కు ఐదింతల డిమాండ్ పెరిగిందని ఓలా పేర్కొంది.

## ఆ ఒక్క ప్రశ్నతో మా సంస్థ ఉద్యోగి రాజీనామాను ఆపాను..



అప్పుడప్పుడే భవిష్యత్తుకు బాటలు వేసుకుంటూ ఎదిగే స్టార్టప్‌లకు ప్రతి ఉద్యోగి కీలకమే. ఒక్క ప్రతిభావంతుడు సంస్థను వీడినా.. ఆ స్థానాన్ని భర్తీ చేయడం కష్టమవుతుంది. అలాంటి పరిస్థితే డిజిటల్ క్రియేటివ్స్ సంస్థకు వచ్చింది. కానీ ఆ స్టార్టప్ సీఈఓ ప్రీతీ మాలిక్ అడిగిన ఒక్క ప్రశ్న ఉద్యోగి ఎటూ వెళ్లకుండా ఆపింది ఈ మేరకు ప్రీతి షేర్ చేసిన లింక్డిన్ పోస్టు వైరల్ అవుతోంది. సంస్థ పనితీరుకు సంబంధించిన అంశాలపై ప్రీతీ మాలిక్ ఒక్కో ఉద్యోగితో మాట్లాడాలని సిద్ధమైవచ్చారు. సరిగ్గా అప్పుడే ఒకరు అనూహ్యంగా రాజీనామా లేఖ ఇచ్చారు. అతడు పనిలో ఎంతో చురుగ్గా ఉంటాడని, అలాంటి వ్యక్తిని కోల్పోవడం ఇష్టం లేక ఒక ప్రశ్న వేశానని చెప్పారు. దానిని ఆమె గేమ్ ఛేంజింగ్ ప్రశ్నగా పేర్కొన్నారు. "మీరు వెళ్లిపోవాలనుకుంటున్నారు కదా..? అసలు మీకు ఎలాంటి రోల్ సరిపోతుందని భావిస్తున్నారు..?అని ప్రశ్నించినట్లు చెప్పారు. దాంతో అతడు రాజీనామా వెనక ఉన్న కారణాన్ని చెప్పేశారు. నన్ను ఆటోమేషన్ వర్క్‌కోసం హైర్ చేసుకున్నారు. ఆ పనిని నేను ఆస్వాదిస్తూ చేస్తున్నా. కానీ దాన్నుంచి దృష్టి మళ్లేలా పదేపదే వేర్వేరు పనులు చేయాల్సి రావడం విసుగుపుట్టిస్తోంది ' అని సమాధానం ఇచ్చారు. "అధిక వేతనం కోసం అతడు సంస్థను వీడటం లేదని నాకు అర్థమైంది. తాను చేస్తోన్న పనుల మధ్య పొంతన లేకపోవడం వల్లే ఆ నిర్ణయం తీసుకున్నారు. మేం అప్పగించిన ఆటోమేషన్ పని విషయంలో అతడిపై ఫిర్యాదుల్లేవు. కానీ తర్వాత అతడిపై పడిన విసుగుపుట్టించే పనుల వల్ల.. ఏకాగ్రత కోల్పోయారు. దాంతో అతడు ఆటోమేషన్ మీద దృష్టి సారించేలా చర్యలు తీసుకున్నాం. ఈ వ్యవహారంలో నాకో విషయం అర్థమైంది. జీతం పెంచడం, ప్రోత్సాహకాలు ఇవ్వడం ఒక్కటే ఉద్యోగిని సంస్థలో కొనసాగేలా చేయదు. తాము చేస్తోన్న పని తమ ఎదుగుదలకు ఉపయోగపడుతుందా అని ఉద్యోగికి అనిపించడం కూడా కీలకమని గుర్తించాను. ఆ ఒక్క ప్రశ్న కంపెనీకి, ఆ ఉద్యోగికి మేలు చేసింది" అని తన అనుభవాన్ని వెల్లడించారు.

# కలెక్టర్‌గా హరేంధిర ప్రసాద్ బాధ్యతల స్వీకరణ



**కాకినాడ, ఏప్రిల్ 02 (నేటి మనదేశమ్) :** కాకినాడ ప్రజలు, ప్రజాప్రతినిధుల సహకారం, సమిష్టి భాగస్వామ్యంతో కాకినాడ జిల్లాను అన్ని రంగాల్లో అభివృద్ధి పథంలో నడిపిస్తానని జిల్లా కలెక్టర్ ఎంఎన్ హరేంధిర ప్రసాద్ తెలిపారు. బుధవారం కాకినాడ జిల్లా కలెక్టర్‌గా ఆయన తన కార్యాలయ ఛాంబర్‌లో బాధ్యతలు స్వీకరించారు. తొలుత ఆయన విశాఖ నుంచి అన్నవరం చేరుకుని సత్యన్నా రాయణ స్వామిని దర్శించుకున్నారు. అనం తరం కాకినాడ జిల్లా కలెక్టరు కార్యాలయానికి చేరుకున్నారు. ఆయనకు జాయింట్ కలెక్టర్ అపూర్వ భరత్, అసిస్టెంట్ కలెక్టర్ మనీషా, డిఆర్ఒ డి.తిప్పే నాయక్, జిల్లా అధికారులు స్వాగతం పలికారు. అనం తరం ఆయన మీడియా ప్రతినిధులతో మాట్లాడుతూ ఘన చరిత్ర, ఎన్నో విశిష్టతలు కలిగిన కాకినాడ జిల్లాలో పని చేయడం తనకు లభించిన అపూర్వ అవకాశమని పేర్కొన్నారు. ఈ అవ కాశం కల్పించినందుకు సిఎంకు ధన్య వాదాలు తెలిపారు. విశాఖపట్నంలో కలెక్టర్‌గా, జివిఎంసి కమిషనర్‌గా పని చేసిన అనుభవంతో కాకినాడ జిల్లాలో గ్రామీణ, పట్టణ ప్రాంతాల సమగ్రాభి వృద్ధికి కృషి చేస్తానని తెలిపారు. ప్రజలందరికీ అందుబాటులో ఉంటూ రాష్ట్ర ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల ఫలాలు అందరికీ అందించేందుకు, అధికారుల సమన్వయం, ప్రజాప్రతినిధుల సహకారంతో జిల్లాను ముందుకు నడిపిస్తా మన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్‌డిఒలు ఎస్ మల్లిబాబు, ఎన్ శ్రీధర్, సిపిఒ పి.త్రినాథ్, డ్వామా పీడీ పి వెంకట లక్ష్మి, సమాచారశాఖ డిడి పి.తిమ్మప్ప, వివిధ శాఖల జిల్లా అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## నిరాటంకంగా
# ఎన్‌టీఆర్ వైద్య సేవలు

- జిల్లా కో-ఆర్డినేటర్ డాక్టర్ కె.అప్పారావు
- సమ్మెలో పాల్గొంటున్నది నాలుగు ఆస్పత్రిలే...
- మిగిలిన 61 ఆస్పత్రుల్లో యథావిధిగా వైద్యం

**విశాఖపట్నం, ఏప్రిల్ 02 (నేటి మనదేశమ్) :** జిల్లాలోని 'ఎన్‌టీఆర్ వైద్య సేవ' నెట్‌వర్క్ ఆస్పత్రుల్లో రోగులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా సేవలు అందుతున్నాయని కో-ఆర్డినేటర్ డాక్టర్ కొయ్యాన అప్పారావు తెలిపారు. ఆస్పత్రులు సమ్మెకు దిగుతున్నట్టు ప్రకటించిన నేపథ్యంలో జిల్లాలో అందుతున్న సేవల వివరాలను ఆయన బుధవారం విలేకరులకు వెల్లడించారు. జిల్లాలో 65 ఆస్పత్రులు ఎన్‌టీఆర్ వైద్య సేవ నెట్‌వర్క్ పరిధిలో ఉండగా, వాటిలో నాలుగు (కిమ్స్ ఐకాన్, వీజే, కేర్ (రామ్‌నగర్) ఇండస్ ఆస్పత్రులు) మాత్రమే సమ్మెలో భాగస్వామ్యమైనట్టు వెల్లడించారు. మిగిలిన 61 ఆస్పత్రులు సమ్మెలో పాల్గొనడం లేదని, యథావిధిగా సేవలు అందిస్తున్నాయని తెలిపారు. సమ్మెలో పాల్గొంటున్న నాలుగు ఆస్పత్రులు కూడా అత్యవసర వైద్య సేవలు అందిస్తున్నాయని వివరించారు. ఈ నేపథ్యంలో రోగులు ఎవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. వైద్య సేవలు అందడంలో ఇబ్బందులు ఎదురైతే ఆస్పత్రుల్లో ఉన్న ఆరోగ్య మిత్ర వద్దకు వెళ్లి సమాచారాన్ని అందించాలని, వారు వెంటనే తమ దృష్టికి తీసుకువస్తారన్నారు. వైద్య సేవలు అందిం చేందుకు నిరాకరించే ఆస్పత్రులపై చర్యలు తీసుకుంటామని స్పష్టంచేశారు. ఏవైనా ఇబ్బందులు ఉంటే 9281068145 నంబర్‌కు సంప్రతించాలని సూచించారు.

## ఒంటిమిట్ట ఆలయం సమీపంలో
# అగ్నిప్రమాదం.. స్పందించిన సిబ్బంది



**కడప, ఏప్రిల్ 02 (నేటి మనదేశమ్) :** ఒంటిమిట్టలో కొలువుదీరిన శ్రీరామచంద్ర స్వామి ఆలయం వద్ద జనరేటర్ వ్యాన్‌లో ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. అక్కడే ఉన్న అగ్నిమాపక సిబ్బంది వెంటనే స్పందించి.. మంటలను అదుపు చేశారు. ఈ ప్రమాదంలో ఆలయం చుట్టూ దట్టమైన పొగ అలముకుంది. ఒంటిమిట్టలో సీతారాముల కల్యాణోత్సవ కార్యక్రమం జరుగుతోంది. ముఖ్యమంత్రి చంద్రబాబు దంపతులు ఈ కార్యక్రమానికి హాజరై.. స్వామి వారికి పట్టువస్త్రాలతో పాటు ముత్యాల తలంబ్రాలు సమర్పించారు. టీటీడీ ఆధ్వర్యంలో నిర్వహిస్తోన్న ఈ వేడుకను వీక్షించేందుకు పెద్దఎత్తున భక్తులు ఒంటిమిట్టకు తరలి వచ్చారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ఉండేందుకు టీటీడీ పటిష్ఠ చర్యలు చేపట్టింది. సీఎం చంద్రబాబు దంప తులు ఒంటిమిట్ట పర్యటన నేపథ్యంలో కట్టుదిట్టమైన కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేశారు అధికారులు.

# వైసీపీ నాయకులు వాస్తవాలు మాట్లాడాలి



**విజయనగరం, ఏప్రిల్ 02 (నేటి మనదేశమ్) :** ఇటీవల జరిగిన డీఆర్‌సీ సమావేశం గురించి వైసీపీ నాయకులు వాస్తవాలు మాట్లాడాలని టీడీపీ జిల్లా అధ్యక్షుడు కిమిడి నాగార్జున కోరారు. బుధవారం విజయ నగరం లోని టీడీపీ కార్యాలయంలో విలేకరులతో మాట్లా డుతూ డీఆర్‌సీ సమా వేశంలో లోతైన చర్చ జరి గిందని, టీడీపీ, వైసీపీ నాయకులు తమ అభిప్రాయా లను వివిధ సమస్యలపై వెల్లడించారన్నారు. ఈ సమా వేశాలు గత ప్రభుత్వ హయాంలో మొక్కుబడిగా సాగేవని, ఈ అలవాటుతోనే వైసీపీ జిల్లా అధ్యక్షుడు మజ్జి శ్రీనివాసరావు మాట్లాడుతు న్నారన్నారు. సమావేశంలో టీడీపీ నాయకుడు ముద్దాడ చంద్రశేఖర్ పాల్గొన్నారు.




# జిల్లా వ్యాప్తంగా బ్లాక్ డే

**రాజమహేంద్రవరం, ఏప్రిల్ 02 (నేటి మనదేశమ్) :** నాలుగు లేబర్ కోడ్‌ల అమలుకు నిరసనగా బుధవారం బ్లాక్ డేను నిర్వహించారు. ఇందులో భాగంగా స్థానిక బాలాజీదాస్ చౌక్ సెంటర్‌లో అఖిల పక్ష కార్మిక సంఘాల ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. కార్మిక వర్గం పోరాడి సాధించుకున్న 29 కార్మిక చట్టాలు కొనసాగించాలని, లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని నినదించారు. సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి బి.పవన్ అధ్యక్షత జరిగిన ఈ కార్యక్రమంలో ఎఐటియుసి జిల్లా కన్వీనర్ కె.రాంబాబు, సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు టి.అరుణ్, ఐఎఫ్‌టియు నాయకులు జోజి మాట్లాడారు. లేబర్ కోడ్‌ల రద్దు కోసం 36 కోట్ల మంది కార్మికులు ఫిబ్రవరి 12న సమ్మె చేశారన్నారు. అయినప్పటికీ ఏప్రిల్ 1నుంచి వీటిని కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం అమలుకు దిగిందన్నారు. ఈ నిర్ణయానికి నిరసనగా బ్లాక్ డేగా నిర్వహించాలని బారత అఖిలపక్ష కార్మిక సంఘాలు నిర్ణయం తీసుకున్నాయన్నారు. కేంద్రంలో అధికారంలో ఉన్న బిజెపి ప్రభుత్వం కార్పొరేట్ సంస్థలకు అనుకూలంగా, కార్మిక వర్గానికి నష్టం కలిగించే విధానాలను అనుసరిస్తుందన్నారు. అందులో భాగంగానే లేబర్ కోడ్‌లను తీసుకొచ్చిం దన్నారు. కార్మిక సంఘాలతో సంప్రదింపులు చేయాలనే ప్రజాస్వామిక పద్ధతులు పాటించకుండా, కోట్లాది మంది కార్మికుల నిరసన గళాన్ని పట్టించుకోకుండా నియంతృత్వ పోకడలతో నాలుగు లేబర్ కోడ్‌ల అమలుకు పూనుకోవడం అప్రజాస్వా మికమన్నారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం కూడా కార్మికులకు కనీస వేతనాలు పెంచకుండా దోపిడీని కొనసాగిస్తుందన్నారు. షాప్స్ అండ్ ఎస్టాబ్లిస్ మెంట్ చట్టాన్ని సవరించి 24 గంటలూ వ్యాపారం చేసుకు నేందుకు జిఒ ఇచ్చిందన్నారు. 8 గంటల పనిని 12 గంటలక పెంచిందన్నారు. వేతనాలు పెంచకుండా, సామాజిక, ఉద్యోగ భద్రత లేకుండా చేసిందని విమర్శించారు. ఈ నేపథ్యంలో పోరాడటం తప్ప మరో మార్గం లేదని కార్మిక వర్గానికి పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా అధ్యక్షులు ఎం.సుందర్ బాబు, జిల్లా నాయకులు ఎస్ఎస్.మూర్తి, రామచంద్రరావు, కె.రామకృష్ణ, పూర్ణిమారాజు, ఎఐటియుసి నాయకులు కొండలరావు, సప్పా రమణ, నల్లా రామారావు, ఐఎఫ్‌టియు నాయకులు ఎవి.రమణ, జోజి ఎస్ఎఫ్ఐ నాయకులు భాస్కర్, రాజా, ఎఐవైఎఫ్ నాయకులు త్రిమూర్తులు, లావణ్య, డివైఎఫ్ఐ నాయకులు రాంబాబు పాల్గొన్నారు. అలాగే ఎల్ఐసి డివిజనల్ ఆఫీసు కార్యాలయం వద్ద భోజన విరామ సమయంలో ఆలిండియా ఇన్స్యూరెన్స్ ఎంప్లాయీస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా యూనియన్ ప్రధాన కార్యదర్శి ఎం.కోదండరామ్ మాట్లాడుతూ ఎల్ఐసిలో ఎంతో కాలంగా ఖాళీగా ఉన్న క్లాస్ 3, 4 తరగతుల ఉద్యో గాలను వెంటనే భర్తీ చేయాలని కోరారు. 1995 పింఛను పథకం అమలు చేయాలన్నారు. తమ ట్రేడ్ యూనియన్‌కి వెంటనే గుర్తింపు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సత్యదేవా, పిఎస్ఎన్.రాజు, జి.శ్రీనివాస్, ఇమ్రాన్, విశ్వనాథ్, బి.శ్రీనివాస్ శిరీష్‌కుమార్, రమేష్‌బాబు, డి.శ్రీని వాస్, పి.శ్రీనివాస్, శ్రీదేవి, శిరీష, విజయదుర్గా, శ్రీలత, పివి.రమణ, సుజాత, పాల్గొన్నారు.

**కొవ్వూరు :** లేబర్ కోడ్‌లకు వ్యతిరేకంగా కొవ్వూరులో సిఐటియు ఆధ్వర్యంలో బ్లాక్ డేను నిర్వహించారు. నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. కొవ్వూరు మున్సిపల్ కార్యాలయం వద్ద, బస్టాండ్ సెంటర్లో, కోరమాండల్ రైల్వే స్లీపర్ కంపెనీ వద్ద నల్ల బ్యాడ్జీలు ధరించి, ప్లకార్డులు ప్రదర్శిస్తూ కార్మికులు పెద్ద ఎత్తున నినదించారు. ఈ సంద ర్భంగా సిఐటియు జిల్లా అధ్యక్షుడు ఎం.సుందర బాబు మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన నాలుగు లేబర్ కోడ్‌లను తక్షణం ఉపసంహరించుకోవాలన్నారు. కార్మిక చట్టాలను యథావిధిగా అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఐఎఫ్‌టియు నాయకులు కోనేటి మల్లేశ్వరరావు, లంకాడ గణపతి, చొక్కాకుల సత్తిబాబు, సుబ్బారావు పాల్గొన్నారు.

# శ్రీశైలం డ్యాం భద్రతను నిపుణుల బృందం పరిశీలన



**శ్రీశైలం, ఏప్రిల్ 02 (నేటి మనదేశమ్) :** శ్రీశైలం డ్యాం భద్రతను సెంట్రల్ డ్యామ్ సేఫ్టీ అథారిటీ (ఎన్‌డిఎస్ఎ) బృందం బుధవారం పరిశీలించింది. ఎన్‌డిఎస్ఎ సభ్యులు డికె శర్మ, డ్యామ్ ఎక్స్‌పర్ట్ చైర్‌పర్సన్ గుల్షన్ రాజ్, హైడ్రో మెకానికల్ ఎక్స్‌పర్ట్ సభ్యులు టికె.శివరాజన్, డ్యామ్ ఎక్స్‌పర్ట్ సభ్యులు జెఎం.గౌతమ్, జువాలజీ ఎక్స్‌పర్ట్ సభ్యులు డ్యామ్ వద్దకు వచ్చారు. ముందుగా వ్యూ పాయింటు వద్ద డ్యామ్ జలవనరుల శాఖ అధికారుల తో క్షేత్ర స్థాయిలో సమావేశాన్ని నిర్వహించారు. డ్యామ్ చీఫ్ ఇంజనీర్ కబీర్ బాష పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా డ్యామ్ ప్రస్తుత స్థితిగతు లను బృందం సభ్యులకు వివరించారు. సమా వేశం అనంతరం డ్యామ్‌లోని నీటి నిల్వలు, డ్యామ్ పటిష్టత, రేడియల్ క్రస్ట్ గేట్లు, గ్యాలరీ, ప్లంజ్ పూల్ ప్రాంతాలను బృందం సభ్యులు పరిశీలించారు. పలు అంశాలపై అధ్యయనం చేసిన తర్వాత పూర్తి వివరాలను గురువారం వెల్లడించనున్నామని వారు తెలిపారు.

# స్వర్ణ రథం ఎత్తు పెంచుతాం

- పుష్కరిణిని ముందుకు జరపడానికి త్వరలో తీర్మానం
- దళిత సత్రానికి రూ.50 లక్షలు, మరగదాంబిక కల్యాణ మండపంలో రెండు బ్లాకుల కేటాయింపు
- కాణిపాక ఆలయ బోర్డు సమావేశంలో తీర్మానాలు



**ఐరాల (కాణిపాకం) ఏప్రిల్ 02 (నేటి మనదేశమ్) :** కాణిపాక వరసిద్ధి వినాయక స్వామి స్వర్ణ రథాన్ని ఎత్తు పెంచడానికి ఆలయ బోర్డు తీర్మానించింది, మంగళవారం ఆలయ సమావేశ మందిరంలో ధర్మకర్తల మండలి చైర్మన్ మణినాయుడు అధ్యక్షతన సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆలయ ఈవో పెంచలకిషోర్ మాట్లాడుతూ.. సమావేశంలో 16 అంశాలపై చర్చించినట్లు తెలిపారు. స్వర్ణ రథంపై స్వామి వారు విహరించే సమయంలో చాలా మంది భక్తులకు స్వామి దర్శనం కావడం లేదని చెప్పారన్నారు. దీంతో రథం ఎత్తును 2.6 అడుగులు పెంచడానికి నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు. దీనికోసం బీహెచ్‌ఈఎల్ వారు రథాన్ని పరిశీలించా రన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఆలయానికి అందించిన 18.60 ఎకరాల భూమిని అన్యా క్రాంతం కాకుండా కాపాడు కోవడం కోసం సరిహద్దు రాళ్లు నాటనున్నట్లు వివరించారు. అభివృద్ధి పనులలో భాగంగా ఆలయం ముందున్న పుష్కరిణిని ముందు జరపడానికి బోర్డు తీర్మానించినట్లు ఈవో తెలిపారు. గతంలో ఆలయ అవసరం కోసం దళితుల సత్రాన్ని తీసుకున్నట్లు గుర్తుచేశారు. దీనికి ప్రత్యామ్యాయంగా మరగదాంబిక కల్యాణ మండపాలలో రెండు బ్లాకు కేటాయించి వారికి రూ.50 లక్షలు అందించడానికి తీర్మానించినట్లు తెలిపారు. కల్యాణ మండపానికి రూ. 10 లక్షలతో మరమ్మతులు, రంగులు వేయడానికి తీర్మానం చేసినట్లు తెలిపారు. దీనికి ప్రభుత్వ అనుమతి లభించాక పనులు ప్రారంభి స్తామన్నారు. ఇందుకోసం కమిటీని ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు.

ఈ సమావేశంలో పూతలపట్టు ఎమ్మెల్యే మురళీమోహన్, ఆలయ బోర్డు సభ్యులు ఊట్లనాగరాజునాయుడు, చంద్ర శేఖర్‌రెడ్డి, సుధాకర్‌రెడ్డి, నరేష్, శివ ప్రసాద్, సుబ్ర హ్మణ్యంరెడ్డి, సతీష్, చంద్రకళ, అన సూయ, వసంత, సునీత, సంధ్యారాణితో పాటు ఈఈ వెంకటనారాయణ, డీఈవో సాగర్‌బాబు, ఏఈవోలు ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

## సిరిమానోత్సవాలకు
# సౌకర్యాలు కల్పించండి

### ఎమ్మెల్యే బేబీ నాయన



**బొబ్బిలి, ఏప్రిల్ 02 (నేటి మనదేశమ్) :** బొబ్బిలి పట్టణ పరిధిలోని గొల్లపల్లి దాడితల్లి, పాత బొబ్బిలి సరేపోలమ్మ సిరిమానోత్సవాలు ఈ నెలాఖరున జరగనున్న నేపథ్యంలో భక్తులకు ఎక్కడా ఎటువంటి అసౌకర్యం కలగనీయవద్దని ఎమ్మెల్యే బేబీనాయన ఆదేశించారు. మున్సిపల్ కమిషనర్ రామలక్ష్మి, ఇతర ఇంజనీరింగ్ అధికా రులతో బుధవారం సాయంత్రం ఆయన తన నివాసంలో సమీక్ష నిర్వహించారు. తాగునీటి ఎద్దడి లేకుండా చూడాలని, సిరిమానుల ఊరేగింపు జరిగే రహదారులన్నీ సక్రమంగా ఉం చాలన్నారు. మరమ్మతులు అవసరమైతే చేపట్టాలని ఆదేశించారు.

వేసవి తీవ్రత దృష్ట్యా భోజరాజపురం మున్సిపల్ ప్రధాన వాటర్‌వర్క్స్ నుంచి ఎటువంటి అంతరాయం లేకుండా నిరంతరం తాగునీటిని రిజర్వా యర్లకు పంపింగ్ జరిగేలా పగడ్బ దీగా చర్యలు చేపట్టాలన్నారు.

పెద్దగెడ్డ రిజర్వాయర్ నుంచి వేగావతినదిలోనికి నీటిని విడుదల చేయాలని జిల్లా అధికారులను ఇప్పటికే కోరినట్లు ఎమ్మెల్యే తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ మాజీ చైర్మన్ రాంబార్కి శరత్‌బాబు, డీఈఈ పెదిరెడ్ల కిరణ్ కుమార్, ఏఈలు పాల్గొన్నారు.

# పలు చోట్ల పింఛన్ల పంపిణీ



**ఉండ్రాంజవరం (తూర్పు గోదావరి) ఏప్రిల్ 02 (నేటి మనదేశమ్) :** ఎన్‌టిఆర్ భరోసా పింఛన్లతో వృద్ధులు, వికలాంగులు, వితంతువు లకు కూటమి ప్రభుత్వం భరోసా ఇస్తుందని రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, సినిమాటోగ్రఫీ మంత్రి కందుల దుర్గేష్ అన్నారు. బుధవారం మండలంలోని మోర్త గ్రామంలో మంత్రి పర్యటిం చారు. లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి పింఛన్‌ను అందజేశారు. వృద్ధుల యోగక్షేమా లను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కూటమి ప్రభుత్వం అందజేస్తున్న వివిధ సంక్షేమ పథకాలను అందుకున్న లబ్ధిదారులు ఎంతో సంతృప్తిని వ్యక్తం చేస్తున్నారని అన్నారు. అనంతరం ప్రభుత్వ విద్యారంగాన్ని బలోపేతం చేసేందుకు చేపట్టిన ఎన్‌రోల్మెంట్‌లో భాగంగా మోర్త ఎంపిపిఎస్-1 పాఠశాలలో నూతనంగా చేరిన విద్యార్థులచే అక్షరా భ్యాసం చేయిం చారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు, పలు ప్రభుత్వ శాఖల అధి కారులు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు. మండపేట : పట్టణంలోని 10, 14 వార్డుల్లో ఎంఎల్ఎ వేగుళ్ల జోగేశ్వరరావు ఎన్‌టిఆర్ భరోసా పింఛన్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాల ద్వారా అర్హులైన ప్రతీ కుటుంబానికి ఆర్థిక భరోసా వస్తుం దన్నారు. ఈ కార్యక్రమంలో శిరంగు ఈశ్వరరావు, శెట్టి రవి, పిట్టా రాజబాబు, సాధనాల చక్రపాణి, బడుగు రత్నంరాజు, చుండ్రు సోమరాజు, కొప్పిరెడ్డి రాజు, మున్సిపల్ కమిషనర్ టి.వి.రంగారావు, తదితరులు పాల్గొన్నారు. పెరవలి : పెరవలి గ్రామంలో జరిగిన పింఛన్ల పంపిణీలో ఎపి స్టేట్ స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ బూరుగుపల్లి శేషారావు పాల్గొన్నారు. పలువురు లబ్ధిదారులకు ఆయన పింఛన్‌ను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఒ కెయు ఆర్ఎల్.పద్మజ, గ్రామ సర్పంచ్ గంగోలు సీతమ్మ, ఎంపిటిసి ఎంపీటీసీ రాపాక ప్రమీల, నాయకులు బొడ్డు రామాంజనేయులు, పిప్పర రవికుమార్, అతికాల రామకృష్ణమ్మ, పంచా యతీ, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు

## నూతన కోర్సులు సద్వినియోగం చేసుకోండి.

### కృష్ణా యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ కూన రాంజీ.



**మచిలీపట్నం ఏప్రిల్ 02 ( నేటి మనదేశమ్ ప్రతినిధి) :** మారుతున్న సాంకేతికతకు అనుగుణంగా కృష్ణా యూనివర్సిటీలో నూతన కోర్సులు ప్రవేశపెట్టడం జరుగుతోందని, విద్యార్థిని విద్యార్థులకు ఇవి ఎంతో ఉపయుక్తంగా ఉంటాయని కృష్ణా యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ కూన రాంజీ అన్నారు.యూనివర్సిటీ పరిధిలోని విజయవాడలో డాక్టర్ ఎన్టీఆర్ పీజీ సెంటర్‌లో "డిప్లమా ఇన్ హాస్పిటాలిటీ ఒ హాస్పిటల్ మేనేజ్‌మెంట్" కోర్సును గురువారం ఆయన లాంఛనంగా ప్రారంభించారు. యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ కూన రాంజీ మాట్లాడుతూ విద్యార్థినీ విద్యార్థులు ఈ కోర్సు ద్వారా ఎంతో లబ్ధి పొందవచ్చున్నారు. యూనివర్సిటీలో అందించే వివిధ రకాల కోర్సులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. రెక్టర్ ప్రొఫెసర్ ఎం.వి. బసవేశ్వర్ రావు, ప్రొఫెసర్ ఉజ్వల్ గటక్ (రాయలసీమ ఫిజియోథెరపీ సెంటర్), ప్రొఫెసర్ సుజిత్ కుమార్ (నేవీ కమాండో), అలాగే ఎన్టీఆర్ పీజీ సెంటర్ కోఆర్డినేటర్ ప్రొఫెసర్ దిలీప్ ఇతర ప్రముఖులు పాల్గొన్నారు. అధ్యక్షులు రాంజీ మాట్లాడుతూ, 2026--27 విద్యా సంవత్సరంనుంచి సమాజానికి అత్యవసరమైన పలు కొత్త కోర్సులను ప్రారంభించనున్నట్లు తెలిపారు.

## పల్నాడులో పెరిగిన వార్డుల సంఖ్య




**నరసరావుపేట, ఏప్రిల్ 02 ( నేటి మనదేశమ్ ప్రతినిధి) :** పల్నాడు జిల్లాలో 7 పురపాలక సంఘాలలో వార్డులు పెంచుతూ బుధవారం ఉత్తర్వులు జారీ అయ్యాయి. చిలకలూరిపేట 38 నుంచి 48, గురజాల 20 నుంచి 23, మాచర్ల 31 నుంచి 36 ,పిడుగురాళ్ల 33 నుంచి 40 ,దాచేపల్లి 20 నుంచి 28 సత్తెనపల్లి 31 నుంచి36 , వినుకొండ 32 నుంచి 36 వార్డులను పెంచారు. వార్డులలో పెరిగిన ఓటర్ల దృష్ట్యా మున్సిపాలిటీల కమిషనర్ల సూచనల మేరకు వార్డులను పెంచుతూ ఉత్తర్వులను జారీ చేశారు.

## రాజమండ్రిలో 4న జాబ్ మేళా




**రాజమండ్రి ఏప్రిల్ 02 ( నేటి మనదేశమ్ ప్రతినిధి) :** రాజమండ్రి కలెక్టరేట్ వద్ద గల వికాస కార్యాలయంలో ఈనెల 4వ తేదీన జాబ్ మేళా నిర్వహించనున్నట్లు కలెక్టర్ కీర్తి చేకూరి తెలిపారు. టెన్త్ నుంచి పీజీ వరకు చదివిన 35 ఏళ్లలోపు అభ్యర్థులు ఈ ఇంటర్వ్యూలకు హాజరుకావచ్చని, పలు ప్రముఖ కంపెనీల్లో ఉద్యోగ అవకాశాలు కల్పించనున్నట్లు పేర్కొన్నారు. నిరుద్యోగులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని, మరిన్ని వివరాలకు వికాస కార్యాలయంలో సంప్రదించాలని సూచించారు. ట్యాగ్స్ :

## మెంటాడలో అగ్నిప్రమాదం.. రూ.8 లక్షల ఆస్తినష్టం



**మెంటాడ ఏప్రిల్ 02 ( నేటి మనదేశమ్ ప్రతినిధి) :** విజయనగరం జిల్లా మెంటాడలో విద్యుదాఘాతంతో అగ్నిప్రమాదం సంభవించింది. ఈ ప్రమాదంలో రూ.70వేల నగదు, 3 తులాల బంగారం, ఇతర వస్తువులు దగ్ధమయ్యాయి. మండల వీధిలోని మండల సత్యవతి ఇంట్లో విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణంగా మంటలు వ్యాపించాయి. గమనించిన స్థానికులు అగ్నిమాపక కేంద్రానికి సమాచారం ఇచ్చారు. సిబ్బంది ఘటనాస్థలికి చేరుకుని మంటలను అదుపు చేశారు. ఈ ప్రమాదంలో రూ. 8 లక్షల వరకు ఆస్తినష్టం వాటిల్లినట్లు అగ్నిమాపక సిబ్బంది అంచనా వేశారు.

## వైభవంగా సత్యమ్మ తల్లి జాతర ఉత్సవాలు



**నందిగామ ఏప్రిల్ 02 ( నేటి మనదేశమ్ ప్రతినిధి) :** మండలంలోని అంబారుపేట సత్యమ్మ తల్లి చైత్రమాస జాతర ఉత్సవాలు కొనసాగుతున్నాయి. ఈ ఉత్సవాల నేపథ్యంలో గురువారం 3500 మంది భక్తులకు అన్నదానం ఏర్పాటుచేశారు. హైదరాబాద్‌కు చెందిన దాతలు తోట ప్రసాద్, భవానీ దంపతులు ఈ కార్యక్రమానికి ఆర్థిక సాయం చేశారు. ఆలయ ఛైర్మన్ మంచాల మాధవ్, ఈవో సీతారావమ్మ, కమిటీ సభ్యులు ఏర్పాట్లను పర్యవేక్షించారు. సత్యమ్మ తల్లి మూలవిరాట్‌ను భక్తులు అధిక సంఖ్యలో దర్శించుకున్నారు.

# బరితెగింపు ఎమ్మెల్యేలు , ఎంపీలపై తక్షణమే చర్యలు చేపట్టండి !

### కూటమి ప్రభుత్వ పనితీరుపై విరుచుకుపడిన పల్నాడు జిల్లా వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ డాక్టర్ గోపిరెడ్డి

**నరసరావుపేట, ఏప్రిల్ 02 ( నేటి మనదేశమ్ ప్రతినిధి) :** గత కొంతకాలంగా కూటమి ఎంపీలు గాని ఎమ్మెల్యేలు గాని ప్రవర్తిస్తున్న తీరు చూసి రాష్ట్ర ప్రజలు అసహ్యించుకుంటున్నారనీ వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ పల్నాడు జిల్లా అధ్యక్షుడు డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాస్ రెడ్డి అన్నారు. గురువారం తాడేపల్లి వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ కేంద్ర కార్యాలయంలో విలేకరుల సమావేశంలో గోపిరెడ్డి మాట్లాడుతూ..... మొన్న నరసరావుపేట శాసనసభ్యుడు చదలవాడ అరవింద్ బాబు దాదాపు పది గంటల పాటు పల్నాడు జిల్లా ఎస్పీ కార్యాలయంలో హల్చల్ చేసి ఆయన విధులను అడ్డుకున్న ఘటన దారుణం అన్నారు. తెలుగుదేశం పార్టీ జిల్లా అధ్యక్షుడు ,వాళ్ళ శాసనసభ్యులు గానీ పోలీసు ఐజి వంటి ఉన్నతాధికారులు వచ్చిన ఏమీ చలనం లేకుండా దాదాపు 8 గంటల పాటు బాత్రూంలో దాక్కున్నాడన్నారు. ఎమ్మెల్యే అరవింద బాబు దాదాపు 10 గంటల పాటు ఎస్పీ ఆఫీసులో ఆయన విధులకు అడ్డు తగులుతూ హల్చల్ చేయడం బరితెగింపు చర్య కాదా అన్నారు. మొన్న ఎంపీ పుట్ట మహేష్ యాదవ్ డ్రగ్స్ కేసులో పట్టుబడినా అరెస్టు చేయకుండా, స్టేషన్ బెయిల్ ఇచ్చి పార్లమెంట్ కి పంపించిన ఘనత ఈ కూటమి ప్రభుత్వానిదన్నారు రైల్వే కోడూరు ఎమ్మెల్యే అరవ శ్రీధర్ బాబు జనసేన పార్టీకి చెందిన ఒక యువతిని మానభంగం చేసి నాలుగైదు సార్లు గర్భవతిని చేసినా అతనిపై ఎటువంటి చర్యలు ఇంతవరకు తీసుకోలేదన్నారు. కనీసం ఈ సంఘటనపై వేసిన కమిటీ రిపోర్ట్ కూడా ఏమైందో ఇంతవరకు ఎవరికీ తెలియని పరిస్థితి! చంద్రబాబు నాయుడు మాట్లాడితే తోలు తీస్తా.... తోలు తీస్తా ...అని ప్రజల ముందు అంటుంటాడు! నువ్వు ఇప్పటివరకు ఎంతమంది తోలు తీసావు.. ఎవరి తోలు తీశావు... ముందు మీ పార్టీ ఎంపీలు ఎమ్మెల్యే చేస్తున్న బరితెగింపులు అవినీతి అక్రమాల మీద చర్యలు తీసుకో... ముందు బరితెగిస్తున్న మీ ఎమ్మెల్యేలు ఎంపీల తోలు తీయాలి ! తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు చంద్రబాబు నాయుడు చాలా సీరియస్ అయ్యారు... ఆగ్రహం గా ఉన్నారని ఎల్లో పత్రికలలో రాస్తుంటారు..ఇప్పటికైనా ఎన్నిసార్లు కనీసం 200 సార్లుచంద్రబాబునాయుడు గారు సీరియస్ అయ్యారు తప్ప... కనీసం ఎక్కడ యాక్షన్ లేదు యాక్షన్ జీరో! చంద్రబాబు నాయుడు గారు సీరియస్ అవుతారు... వారి పార్టీ అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు గారు వివరణ అడుగుతారు అంతే .....ఈ రెండు సంవత్సరాలు నుంచి జరుగుతుంది ఇంతే !ఎక్కడ ఎవరి మీద చర్యలు తీసుకున్న దాఖలాలు లేవు! అదే వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ వాళ్లు ఒక చిన్న కానిస్టేబుల్ లో గాని ఎస్పై గారి విధులు గాని అడ్డుకున్న ,ఏదైనా మాట్లాడిన వెంటనే వారి మీద ఒకటికి నాలుగు కేసులు ఫైల్ చేస్తారు! మరి పది గంటల పాటు రాజ్యాంగాన్ని అమలుపరిచే అత్యంత కీలకమైన ఒక ఐపీఎస్ అధికారి విధులు అడ్డుకుంటే వీళ్ళు అరవింద బాబు మీద కనీసం కేసు పెట్టాలని ఇంగిత జ్ఞానం కూడా ఈ కుటుంబం ప్రభుత్వానికి లేదు! చంద్రబాబు నాయుడు గారు సీరియస్ గా ఇటువంటి వ్యక్తుల మీద యాక్షన్ తీసుకోపోతే భవిష్యత్తులో ఇంకా ఇటువంటి అరాచకాలు ఎక్కువ అయ్యే ప్రమాదం ఉంది! అదేవిధంగా ఎమ్మెల్యేల పరిస్థితి చూస్తే....వీళ్ళు లు మరీ బరి తెగించి ప్రవర్తిస్తున్నారని ,ఘోరమైన విషయం ఏమిటంటే ఆఖరికి సీఎంఆర్ఎఫ్ చెక్కులు ఇచ్చిన కమిషన్ తీసుకుంటున్నారు. నరసరావుపేటలో తిరుపతి లెటర్లు కూడా




అమ్ముకుంటున్నారు ! ఇక్కడ నియోజకవర్గంలో ఎవరికి తిరుపతి లెటర్లు ఇవ్వట్లేదు .అడిగిన వారికి ఆరు నెలల వరకు ఖాళీ లేదని చెప్పి పంపిస్తున్నారు ఇక నరసరావుపేట ఎమ్మెల్యే పరిస్థితి గురించి చెప్పాల్సిన అవసరం లేదు ఈయన ఈ రకంగా హల్చల్ చేయటం ఇది మొదటిసారి కాదు, మొన్నటికి మొన్న నరసరావుపేట ఆర్డిఓ ఆఫీస్ కి వెళ్లి ఒక ఔట్సోర్సింగ్ ఉద్యోగం కోసం ఒక గేదెలు కాసుకునే వ్యక్తిని తీసుకెళ్లి సాయంత్రం నాలుగు గంటల లోపుఅవుట్సోర్సింగ్ ఉద్యోగం ఇవ్వాలని బెదిరించాడు! అంతకుముందు ఎక్సైజ్ డిపార్ట్మెంట్లో కమిషనర్ ఆఫీస్ లో బైఠాయింపు చేసి పాత వాళ్ల ఉద్యోగాలు తీసేసి తను చెప్పిన కొత్త వారి ఉద్యోగాలు ఇవ్వాలని ఎక్సైజ్ కమిషనర్ ఆఫీస్ లో ధర్నా చేశాడు! నరసరావుపేటలో కమిషన్ ఇవ్వలేదనే కారణంతో టిడిపికి చెందిన బార్ షాపులను సైతం మూసేయించాడు! వాళ్లు తెలుగుదేశం పార్టీ సెంట్రల్ ఆఫీస్ కి వచ్చి లోకేష్ గారికి కంప్లైంట్ చేయడం కూడా జరిగింది ! మొన్నటికి మొన్న కోటప్పకొండ తిరుణాలలో నేరుగా హోంగార్డుల చేత మద్యం అమ్మకాలు చేయించారు ! రెడ్ హ్యాండెడ్గా పట్టుకుంటే హోంగార్డు ని సస్పెండ్ చేసి మమ అనిపించారు! నరసరావుపేటలో అనేక పేకాట శిబిరాలు ఈ ఎమ్మెల్యే దగ్గరుండి నడిపిస్తాడు! మొన్నటికి మొన్న నరసరావుపేటూ=ఖు కాలనీలో నాలుగు కేజీల గంజాయి సైతం దొరికింది ఎంతో పవిత్రంగా భావించే కోటప్పకొండ తిరుణాలలో సైతం హోంగార్డు చేత మద్యం అమ్మకాలు కొనసాగించారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు గారు గత ఎన్నికల్లో ఇచ్చిన ఒక్క హామీని కూడా నెరవేర్చకుండా ప్రజల్ని మోసం చేస్తున్నాడు ! ముఖ్యంగా రుణమాఫీ నిరుద్యోగ భృతి వంటి అంశాల్లో ప్రజలను తీవ్రంగా మోసం చేశారు! గత ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి గారి ప్రభుత్వంలో అనేక సంక్షేమ పథకాలను అమలు చేయడం జరిగిందని ,విద్యా, వైద్య మరియు వ్యవసాయ రంగాల్లో గత వైసిపి ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాలు ప్రజలకు ఎంతో మేలు చేశాయని ఈ సందర్భంగా తెలియజేశారు. జనసేన అధినేత పవన్ కళ్యాణ్ కేవలం చంద్రబాబు నాయుడు ప్రయోజనాల కోసం మాత్రమే పని చేస్తున్నారని ప్రజా సమస్యలపై ఆయనకు ఎటువంటి చిత్తశుద్ధి లేదని తీవ్రంగా విమర్శించారు వచ్చే ఎన్నికల్లో ప్రజలు తిరిగి వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీని ఆదరిస్తారని ,గత ఐదేళ్లలో వైసిపి ప్రభుత్వం జరిగిన అభివృద్ధి సంక్షేమమే తమను గెలిపిస్తుందని ఈ సందర్భంగా తెలియజేశారు.

## జగన్‌కు రాజకీయ పరిజ్ఞానం లేదు: ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ



**గుంటూరు ఏప్రిల్ 02 ( నేటి మనదేశమ్ ప్రతినిధి) :** మాజీ సీఎం జగన్‌కు రాజకీయ పరిజ్ఞానం లేదని సత్తెనపల్లి ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ అన్నారు. గుంటూరులోని నివాసంలో గురువారం నిర్వహించిన మీడియా సమావేశంలో మాట్లాడారు. రాష్ట్ర విభజన తర్వాత అన్ని పార్టీల అనుమతితోనే రాజధాని అమరావతిని ప్రకటించారన్నారు. అప్పుడు జగన్ అమరావతికి అంగీకరించారని చెప్పారు. ఒక్క అవకాశం ఇస్తే రాజధాని అమరావతిని అభివృద్ధి చేస్తానంటూ ప్రజలను మోసం చేశారన్నారు. తరువాత మాట తప్పి మూడు రాజధానులంటూ రాష్ట్రాన్ని సర్వనాశనం చేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. వైకాపా పాలనలో ఉత్తరాంధ్ర ప్రజలు బెంబేలెత్తిపోయారని కన్నా లక్ష్మీనారాయణ అన్నారు. అరాచక పాలనకు స్వస్తి పలకాలన్న ఉద్దేశంతోనే 2024 ఎన్నికల్లో ప్రజలు ప్రతిపక్ష హోదా కూడా లేకుండా చేశారని చెప్పారు. ఎన్నికల్లో వైకాపా ఓటమి తర్వాత అసెంబ్లీకి వచ్చి అమరావతి ప్రజలకు, రైతులకు జగన్ క్షమాపణ చెప్పాల్సిందన్నారు. కానీ అహంకారంతో మాట్లాడుతున్న ఆయన్ను చూసి ప్రజలు ఛీత్కరించుకుంటున్నారని అన్నారు. అమరావతే రాజధాని అని ప్రజలు స్పష్టమైన వైఖరితో ఉన్నారని కన్నా లక్ష్మీనారాయణ అన్నారు. చట్టబద్ధత బిల్లు ఆమోదం సమయంలో వైకాపా ఎంపీలు పార్లమెంట్ సమావేశాల నుంచి వాకౌట్ చేయడం సిగ్గుచేటని దుయ్యబట్టారు. అమరావతికి చట్టబద్ధత కోసం విశేషకృషి చేసిన సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్‌కు కన్నా లక్ష్మీనారాయణ అభినందనలు తెలిపారు.

## గర్భిణిగా ఉన్న భార్యను చూసేందుకు వెళ్తూ.. తిరిగిరాని లోకాలకు!



**శిరివెళ్ల ఏప్రిల్ 02 ( నేటి మనదేశమ్ ప్రతినిధి) :** గర్భిణిగా ఉన్న భార్యను చూసేందుకు ద్విచక్ర వాహనంపై వెళ్తున్న వ్యక్తిని ఏపీఎస్ ఆర్టీసీ బస్సు ఢీకొన్న ఘటనలో అక్కడికక్కడే మృతి చెందినట్లు ఎస్సై మధుసూదన్ గురువారం తెలిపారు. పోలీసుల వివరాల ప్రకారం.. మండలంలోని గుండంపాడు గ్రామానికి చెందిన గాలి ప్రవీణ్ కుమార్ (25) ఇదే మండలంలోని యర్రగుంట్ల గ్రామానికి చెందిన అనుష్కతో ఏడాదిన్నర క్రితం వివాహమైంది. భార్య 8 నెలల గర్భిణి. దీంతో యర్రగుంట్లలోని ఆమె పుట్టింటికి పంపించాడు. భార్యను చూసేందుకు తన ద్విచక్ర వాహనంపై వెళ్తుండగా నంద్యాలకు వెళ్తున్న ఆర్టీసీ బస్సు వాహనాన్ని ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో బైక్‌పై ఉన్న ప్రవీణ్ కుమార్ అక్కడికక్కడే మృతి చెందాడు. 10 నిమిషాల వ్యవధిలో ఇంటికి వస్తానన్న తన భర్త రహదారి ప్రమాదానికి గురై ఇక తిరిగిరాని లోకాలకు వెళ్లాడని భార్య, కుటుంబసభ్యులు ప్రమాదస్థలిలో రోదించిన తీరు స్థానికులను కంటతడి పెట్టించింది. మృతుడి తండ్రి జోజప్ప ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు. మృతదేహాన్ని శవపరీక్ష నిమిత్తం నంద్యాల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించినట్లు వెల్లడించారు.

## అమరావతి చట్టబద్ధత బిల్లుకు ఆమోదం పట్ల మంత్రి కొల్లు రవీంద్ర హర్షం.



**మచిలీపట్నం ఏప్రిల్ 02 ( నేటి మనదేశమ్ ప్రతినిధి) :** అమరావతి చట్టబద్ధత బిల్లుకు ఆమోదం లభించడం పట్ల మంత్రి కొల్లు రవీంద్ర హర్షం వ్యక్తం చేశారు. అనకాపల్లి జిల్లా కలెక్టర్ కార్యాలయంలో స్పీకర్ చింతకాయల అయ్యన్న పాత్రుడు, మంత్రులు వంగలపూడి అనిత సమక్షంలో రవీంద్ర సంబరాలు చేసుకున్నారు. మంత్రులు కలెక్టరేట్లో కేక్ కట్ చేసి సంబరాలు జరుపుకున్నారు. బిల్లును పార్లమెంట్ ఉభయసభలు ఏకగ్రీవంగా ఆమోదం తెలపడం శుభపరిణామం అన్నారు. అమరావతి బిల్లు ఏకగ్రీవంగా ఆమోదం పొందడం ప్రజా విజయమన్నారు. గత ఐదేళ్లు ఎన్నో అవస్థలు ఎదురొడ్డి పోరాడిన అమరావతి రైతులకు ఈ విజయం అంకితం అన్నారు.

## లక్ష్మికి నిత్యావసరాలు అందజేత



**భీమవరం ఏప్రిల్ 02 ( నేటి మనదేశమ్ ప్రతినిధి) :** భీమవరంలో డయాలసిస్‌తో బాధపడుతూ ఇటీవల భర్తను కోల్పోయిన సివాంగుల లక్ష్మికి, టీడీపీ తెలుగు యువత పట్టణ అధ్యక్షుడు గోలగాని రమేష్, మాజీ కౌన్సిలర్ మైలబత్తుల ఐజాక్ బాబుల ఆధ్వర్యంలో రెండు నెలలకు సరిపడా నిత్యావసర సరుకులు, బియ్యం బస్తాను గురువారం అందజేశారు. ఆపదలో ఉన్నవారికి సహాయం చేయడం మానవత్వమని, వారికి అండగా ఉంటామని రమేష్ తెలిపారు. ఈ కార్యక్రమంలో మల్లువలస రాము, నార్ని లక్ష్మీ, కాపా అమర్ బాబు, ఫణి కుమార్ పాల్గొన్నారు.

## మేక మాంసం పేరుతో... బీఫ్ విక్రయం



**కాకినాడ ఏప్రిల్ 02 ( నేటి మనదేశమ్ ప్రతినిధి) :** కాకినాడ రూరల్‌లోని సర్పవరంలో మేక మాంసం పేరుతో బీఫ్ కలిపి విక్రయిస్తున్న ఘటన వెలుగులోకి వచ్చింది. పూల మార్కెట్ సమీపంలోని దుకాణంపై మేక మాంసం వర్తక సంఘం సభ్యులు తనిఖీలు నిర్వహించగా ఈ మోసం బయటపడింది. దుకాణ నిర్వాహకుడిని పట్టుకుని గ్రామ పంచాయతీ అధికారులకు అప్పగించారు. తక్కువ ధరల పేరుతో వినియోగదారులను మోసం చేస్తున్నారని సంఘం ఆరోపించింది. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, అనుమతి లేని దుకాణాలపై కఠిన చర్యలు తీసుకోవాలని అధికారులు కోరారు.

## లేగదూడల సంరక్షణే లక్ష్యం



**మేదరమెట్ల ఏప్రిల్ 02 ( నేటి మనదేశమ్ ప్రతినిధి) :** లేగదూడల సంరక్షణే లక్ష్యంగా కృషి చేస్తున్నట్లు జిల్లా పశుగణాభివృద్ధి శాఖ ఈవో మురళీకృష్ణ అన్నారు. కొరిశపాడు మండలం తమ్మవరం గ్రామంలో గురువారం ఏర్పాటుచేసిన లేగదూడల ప్రదర్శన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మురళీకృష్ణ మాట్లాడుతూ.. గ్రామీణ ప్రాంతాల్లో దూడల మరణాల శాతం తగ్గించేందుకు కృషి చేస్తున్నట్లు తెలిపారు. దూడలకు వస్తున్న వ్యాధులు.. వాటికి అందించే చికిత్సల గురించి వివరించారు. పాడి రైతులకు ఉచితంగా మందులు పంపిణీ చేశారు. లేగ దూడల ప్రదర్శన నిర్వహించి విజేతలకు బహుమతులు అందించారు. ఈ కార్యక్రమంలో అద్దంకి పశుసంవర్ధక శాఖ ఏడీ బ్రహ్మయ్య, వైద్యులు సైదయ్య, రాంబాబు, ఎంపీటీసీ సభ్యుడు శ్రీనివాసరావు, తెదేపా నాయకులు కరిచేటి రాంబాబు, శ్రీనివాస్, పాడి రైతులు పాల్గొన్నారు.

## ఏరియా ఆసుపత్రిలో నూతన ఎక్స్‌రే మిషన్ ప్రారంభం



**ఆదోని మార్కెట్ ఏప్రిల్ 02 ( నేటి మనదేశమ్ ప్రతినిధి) :** పట్టణంలోని ఏరియా ఆసుపత్రిలో ఉన్న టీబీ యూనిట్‌లో కొత్తగా హ్యాండ్ హ్యాండిల్ ఎక్స్‌రే మిషన్‌ను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మెడికల్ ఆఫీసర్స్ డాక్టర్ సేఖన్ భాను, డాక్టర్ మిథిలేష్ ఆధ్వర్యంలో శంకర్‌నగర్ పీహెచ్‌సీ, అమరావతి నగర్ ప్రాంతంలో టీబీ ముక్త్ భారత్ అభియాన్ 2.0ను నిర్మించారు. ఈ సందర్భంగా జిల్లా కోఆర్డినేటర్ ఉమాపతి మాట్లాడుతూ పీఎం టీబీఎంబీఏ ద్వారా క్షయ వ్యాధిని పూర్తిగా అంతమొందించేందుకు ప్రతి ఒక్కరూ ఉచితంగానే ఎక్స్‌రేలు తీసుకునేందుకు ముందుకు రావాలని పిలుపునిచ్చారు. హైరిస్క్ ఏరియాలో 14 ఏళ్లు పైబడిన వారందరికీ ఉచితంగా పరీక్షలు, ఎక్స్‌రేలు తీయనున్నట్లు చెప్పారు. అందుకు ప్రతి ఒక్కరూ సహకరించి క్షయ వ్యాధిని సమూలంగా నిర్మూలించాలన్నారు. ఈ కార్యక్రమంలో సూపర్వైజర్లు బాబురాజు, స్వరూప్ రాజకుమార్, తదితరులు పాల్గొన్నారు.

## గుంటూరులో 5.75 టన్నుల రేషన్ బియ్యం పట్టివేత



**గుంటూరు ఏప్రిల్ 02 ( నేటి మనదేశమ్ ప్రతినిధి) :** గుంటూరు నగరంలో పోలీస్ టాస్క్‌ఫోర్స్ అధికారులు 5.75 టన్నుల రేషన్ బియ్యాన్ని పట్టుకున్నారు. గుంటూరు తూర్పు నియోజకవర్గంలో రేషన్ బియ్యాన్ని అక్రమంగా తరలిస్తున్న వాహనాన్ని టాస్క్‌ఫోర్స్ అధికారులు తనిఖీ చేశారు. ఇందులో 2.75 టన్నుల రేషన్ బియ్యాన్ని గుర్తించారు. గతంలో నుంచే రేషన్ అక్రమాలకు పాల్పడుతున్న అనిల్ అనే వ్యక్తికి చెందినవిగా అధికారులు గుర్తించి సీజ్ చేసి, పాతగుంటూరు పోలీస్ స్టేషన్‌కు తరలించారు. పశ్చిమ నియోజకవర్గంలో తనిఖీలు చేస్తున్న క్రమంలో మరో 2 టన్నుల రేషన్ బియ్యాన్ని అధికారులు పట్టుకుని స్టేషన్‌కు తరలించారు.

Edited, Printed, Published and Owned by K.S. Rangasayi and published from D.No: 1-3/21-16, Kamakotinagar, Vidyadharapuram, Vijayawada-520 012. (A.P.) and Printed at SKYLINE PRESS, D.No: 1-3/21-16, Kamakotinagar, Vidyadharapuram, Vijayawada-520 012. (A.P.), Associate Editor : K. Neeraja, Ph: 0866-2411299. E-mail: netimanadesam.vja@gmail.com